ఈనాడు కర్నూలు

శనివారం అక్టోబరు 5, 2024





స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను గ్రామోత్సవానికి తీసుకెళ్తున్న ఈవో డి.పెద్దిరాజు, అధికారులు, అర్చకులు



ఆకట్టుకున్న కళాకారిణుల నృత్యం

# బ్రహ్మచారిణిగా భ్రమరాంబ

**■ మయూర వాహనంపై మల్లన్న ■ శ్రీగిరిలో దసరా మహోత్సవాలు**

ఇలకైలాసంలో దసరా మహోత్సవాల సందడి మిన్నంటింది... భ్రమరాంబాదేవి రెండో రోజు బ్రహ్మచారిణిగా కొలువుదీరి పూజలందుకున్నారు. అక్క మహాదేవి అలంకార మండపంలో స్వామిఅమ్మవార్ల ఉత్సవ మూర్తులను శోభాయమానంగా ముస్తాబు చేసి మయూర వాహనంపై అధిష్ఠింపజేశారు. అనంతరం అర్చకులు రుద్ర మంత్రాలతో, ధూపదీప హారతులు సమర్పించి పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులు గ్రామోత్సవానికి తరలిరాగా, ఈవో డి. పెద్దిరాజు నారికేళాలు సమర్పించారు. పరివార దేవతామూర్తుల హారతులు అందుకొని స్వామిఅమ్మవార్లు గ్రామోత్సవానికి పురవీధుల్లోకి చేరుకున్నారు. కళాకారుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

**శ్రీశైలం ఆలయం, న్యూస్‌టుడే:**

**నేడు**

దసరా మహోత్సవాల మూడో రోజు భ్రమరాంబాదేవి భక్తులకు చంద్రఘంట అలంకారంలో శనివారం దర్శనమివ్వనున్నారు. స్వామి అమ్మవార్లకు రావణ వాహన సేవ జరుగనుంది. దక్షిణ మాడ వీధిలో సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

# విశ్వమిథ్యాలయం



**■ ఆర్‌యూలో మసకబారిన ఇంజినీరింగ్ విద్య**

**■ ఈ ఏడాది పడిపోయిన ప్రవేశాలు**

రాయలసీమ విశ్వవిద్యాలయం(ఆర్‌యూ)లో ఇంజినీరింగ్ విద్య మసకబారింది. సౌకర్యాలు లేకపోవడంతో ప్రవేశం తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి కనబరచడం లేదు. ఈ ఏడాది మొదటి విడత కౌన్సెలింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్‌లో నలుగురు విద్యార్థులు చేరారు. రెండో విడత కౌన్సెలింగ్ సమయానికి ఇద్దరు మరో కళాశాలకు వెళ్లడంతో ఇద్దరికే పాఠాలు బోధించాల్సి వస్తోందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గత ఐదేళ్ల వైకాపా హయాంలో వర్సిటీలో రాజకీయం పెత్తనం చేసింది.. పాలక వర్గం సౌకర్యాలపై శీతకన్నేసింది.. ఫలితంగా కనీసం సగం సీట్లు కూడా భర్తీ కావడం లేదు. కూటమి ప్రభుత్వం దృష్టి సారించి సౌకర్యాలు మెరుగు పరచాలని విద్యార్థులు విన్నవిస్తున్నారు. కర్నూలు విద్య, న్యూస్‌టుడే :

**చేరింది కొందరే**

ఆర్‌యూ ఇంజినీరింగ్ కళాశాలలో గత ఐదేళ్లుగా పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ కావడం లేదు. మొత్తం సీట్లలో 45 శాతం మాత్రమే భర్తీ అవుతోంది. 2023-24లో సివిల్ ఇంజినీరింగ్‌లో ఒక్క విద్యార్థీ చేరలేదు. మెకానికల్‌లో ఇద్దరే చేరారు. ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్‌లో 20 మంది, ఈసీఈ 48, సీఎస్ఈలో 107 మంది ప్రవేశం పొందారు. 2024-25లో 396 సీట్లు భర్తీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. సివిల్ ఇంజినీరింగ్‌లో 10 మంది, మెకానికల్‌లో ఇద్దరు, ఈసీఈ 64, సీఎస్ఈ 132, ఆర్టిఫిషియల్ ఇంజినీరింగ్‌లో 62 మంది చేరారు. మెకానికల్‌లో చేరిన ఇద్దరికి కళాశాల ప్రిన్సిపల్ పాఠాలు బోధిస్తారు. సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరేవారు తక్కువగా ఉండటంతో మూతపడే అవకాశాలు ఉన్నట్లు కనిపిస్తోంది.

**ప్రయోగాలు పక్క కళాశాలలో**

ఆర్‌యూలో ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు సరైన వసతులు కల్పించడం లేదు. ప్రయోగాల కోసం సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలను ఆశ్రయించాల్సిన పరిస్థితి. దీంతోపాటు వసతిగృహాల్లో సౌకర్యాలు అధ్వానంగా ఉంటున్నాయి. భోజనం నాణ్యతగా ఉండటం లేదు. అవసరమైన అధ్యాపకుల కొరత వేధిస్తోంది. ఈ నేపథ్యంలో ఇక్కడ ఇంజినీరింగ్ విద్య చదివేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మొత్తం సీట్లలో 45 శాతం భర్తీ అవుతున్నాయి.

**దక్కని గుర్తింపు**

వర్సిటీల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, బోధన ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థలకు యూజీసీ జాతీయ గుర్తింపు మదింపు కమిటీ (న్యాక్) గ్రేడింగ్ ఇస్తుంది. 2022లో ఆర్‌యూ గ్రేడ్ 'ఏ' నుంచి 'బీ'కి పడిపోయింది. ప్రస్తుత 'బి' గ్రేడ్ కూడా దక్కకపోవడం గమనార్హం. కళాశాలల ఎంపికలో విద్యార్థులు న్యాక్ గ్రేడ్ కచ్చితంగా పరిశీలిస్తారు.. అక్కడ లభించే వసతులపై ఆరా తీస్తారు. ఆర్‌యూలో సౌకర్యాలు అధ్వానంగా ఉండటంతో అడ్మిషన్లు సరిగా జరగడం లేదని అధ్యాపకులు పేర్కొంటున్నారు. విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉండగా పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది.




# పేదల దుక్కి.. పెద్దలకు దక్కి

**■ పరిశీలనలో వెలుగు చూస్తున్న అక్రమాలు**

**■ వైకాపా హయాంలో ఫ్రీహోల్డ్ మాయాజాలం**

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే:

పేదల దుక్కిలో పెద్దలు పాగా వేశారు.. అధికారులను మచ్చిక చేసుకొని పేదల భూములను సొంతం చేసుకొన్నారు. 2003 సంవత్సరానికి ముందు పేదలకు అందజేసిన భూములకు యాజమాన్య హక్కులు (ఫ్రీహోల్డ్) కల్పిస్తూ గత ప్రభుత్వం జీవో జారీ చేసింది. దాని మాటున వేలాది ఎకరాలు సొంత చేసుకొన్నారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం నియోజకవర్గ ప్రత్యేకాధికారుల వద్ద దస్త్రాల పరిశీలన సాగుతోంది. కోడుమూరు మండలం గోరంట్ల రెవెన్యూ గ్రామ పరిధిలో నాలుగు సర్వే నంబర్లలో 12 ఎకరాల ప్రభుత్వ భూములను గత వైకాపా ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ చేశారు. వాటికి అసైన్‌మెంట్ కమిటీ రిజిస్టర్ లేదు. డీకేటీ పట్టాలు లేకుండా ఫ్రీహోల్డ్ చేసినట్లు వెలుగులోకి వచ్చింది. ఇలా విచారణలో పలు అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ నెల 7వ తేదీ నాటికి ఈ ఫ్రీహోల్డ్ భూముల పరిశీలన పూర్తి చేయాలని సీసీఎల్‌ఏ నుంచి ఆదేశాలు అందాయి.




| సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం | రిజిస్ట్రేషన్ చేసిన భూమి (ఎకరాలు) |
|---|---|
| ఆదోని | 19.73 |
| ఆలూరు | 26.38 |
| ఆస్పరి | 57.53 |
| గూడూరు | 15.14 |
| కోడుమూరు | 91.33 |
| పత్తికొండ | 55.19 |
| ఓర్వకల్లు | 38.38 |
| ఎమ్మిగనూరు | 30.40 |
| కర్నూలు | 67.43 |
| కల్లూరు | 25.80 |

**గుట్టుగా రిజిస్ట్రేషన్లు**

వైకాపా ప్రభుత్వం భూయాజమాన్య హక్కులు కల్పించాలని నిర్ణయం తీసుకున్న వెంటనే పలువురు తమ పేరిట, బినామీల పేరిట రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. వైకాపా నేతలు, ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఎసైన్డ్ భూములను తక్కువ ధరలకు కొనుగోలు చేసి ఫ్రీహోల్డ్ చేయించుకొని ఆ వెనువెంటనే రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. కర్నూలు జిల్లాలో 109.04 ఎకరాల్లో రిజిస్ట్రేషన్లు జరిగినట్లు ప్రాథమికంగా తేలింది.

● రిజిస్ట్రేషన్లు జరిగిన వాటిల్లో విక్రయ, గిఫ్ట్ డీడ్ పత్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. నిషేధిత జాబితాలో ఉన్న ఎసైన్డ్ భూముల డీ-నోటిపై చేసిన వాటిని రిజిస్ట్రేషన్ చేయకూడదని ప్రభుత్వం ఆదేశించింది. కర్నూలు రూరల్ మండలం పి. రుద్రవరంలో సర్వే నంబరు. 408 హెచ్ తోపాటు మరో సర్వే నంబరులో 5 రిజిస్ట్రేషన్లు జరిగాయి.

కోడుమూరు మండలం పులకుర్తిలో సర్వే నంబరు 56/103లో 5.76 ఎకరాల ఇనామ్ డ్రై భూమి( ఖాతా నంబరు 101707). పట్టాదారు పేరు దగ్గర 'మిగులు భూమి' అని రాసి ఉంది. ఇనామ్ "బి" రిజిస్టర్ రెవెన్యూ గ్రామ పరిధిలో అందుబాటులో లేదు. ఆర్ఎస్ఆర్ ప్రకారం ఈ భూమిని సర్వీసు ఇనామ్ కింద కార్పెంటర్‌కు ఇచ్చిన భూమి. డి.నోటిఫైడ్ కింద సెక్షన్ 22(ఎ) జాబితాలో ఈ భూముల వివరాలు లేవు. ఈ భూమిని ఫ్రీహోల్డ్ చేశారు. ఈ భూమికి సంబంధించి సరైన ఆధారాలు లేకపోవడంతో ఈ భూములకు భూయాజమాన్య హక్కులు కల్పించడం చట్టవిరుద్ధమంటూ దస్త్రాన్ని ప్రత్యేక ఉప కలెక్టర్ తిరస్కరించారు.

**37,652.19 ఎకరాలకు హక్కులు**

అసైన్‌మెంట్ లబ్ధిదారులకు పెద్ద ఎత్తున లబ్ధి చేకూరుస్తున్నట్లు వైకాపా ప్రభుత్వం గతేడాది ఆర్భాటంగా ప్రకటించింది. జిల్లాలో 13,880.01 ఎకరాల ఎసైన్డ్, 23,772.18 ఎకరాల సర్వీసు ఇనామ్ భూములకు భూ యాజమాన్య హక్కులు కల్పించారు. ఇక్కడే అధికారులు, నాటి అధికార పార్టీ నేతలు కుమ్మక్కై అక్రమాలకు తెరలేపారు. 2003 తర్వాత పట్టాలిచ్చిన, అసలు పట్టాలే లేకుండా ఆన్‌లైన్‌లో ఉన్న భూములకు హక్కులు రాసిచ్చారు. ఫ్రీహోల్డ్ చేసిన 37,652.19 ఎకరాలు ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా చేశారన్న ఆరోపణలున్నాయి.

| రెవెన్యూ డివిజన్ | ఫ్రీహోల్డ్ అయిన ఎసైన్డ్ భూములు | సర్వీసు ఇనామ్ భూములు(ఎకరాల్లో..) |
|---|---|---|
| కర్నూలు | 639.10 | 12,497.26 |
| ఆదోని | 2,256.23 | 5,370.58 |
| పత్తికొండ | 10,984.68 | 5,904.34 |

● ఎసైన్‌మెంట్ కమిటీ రిజిస్టర్లు లేకపోయినా, డి.పట్టాలు కానరాకున్నా భూయాజమాన్య హక్కులు కల్పించినట్లు తెలుస్తోంది. పత్తికొండ రెవెన్యూ డివిజన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఫ్రీహోల్డ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించారన్న విమర్శలున్నాయి.

● పత్తికొండ డివిజన్‌లోని తొమ్మిది మండలాల్లో 10,984.68 ఎకరాల ఎసైన్డ్ భూములు ఫ్రీహోల్డ్ అయ్యాయి. ఆస్పరిలో 2,470.90 ఎకరాలు, దేవనకొండ 1,524.06, కృష్ణగిరి 1,527.29, పత్తికొండ 1,768.79, తుగ్గలి 1,764.99, ఆలూరు 865.23, మద్దికెర 768.85, చిప్పగిరి 224.89, హాలహర్విలో 69.68 ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించారు.

● ఆదోని డివిజన్ పరిధిలో కౌతాళంలో 1,035.08 ఎకరాలు, నందవరం 398.3, ఎమ్మిగనూరు 201.91, పెద్దకడబూరు 137.41, కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలో సి.బెళగల్‌లో 186.36 ఎకరాలకు యాజమాన్య హక్కులు కల్పించారు.

**ఇనామ్ భూములు ఇచ్చేశారు**

జిల్లాలో 20 ఏళ్లకు పైబడిన ఎసైన్డ్ భూములతోపాటు సర్వీసు ఇనామ్ భూములకు యాజమాన్య హక్కులు కల్పించారు. గతంలో దశాబ్దాలు, శతాబ్దాల కిందట గ్రామాల్లో కులవృత్తులు చేసుకునేవారికి.. సర్వీసు ఇనామ్ కింద భూములిచ్చారు. ఈ భూములను అనుభవిస్తున్న కుల వృత్తులవారు ప్రస్తుతం నూటికి 5 మంది కూడా లేరు. ఆ భూముల క్రయవిక్రయాలు జరిగిపోయాయి. ప్రస్తుతం అనుభవంలో ఉన్నవారికి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సర్వీసు ఇనామ్ కింద భూ యాజమాన్య హక్కులు కల్పిస్తున్నారు.

| మండలం | ఎకరాలు |
|---|---|
| కర్నూలు గ్రామీణ | 2,241.76 |
| వెల్దుర్తి | 2,034.31 |
| కోడుమూరు | 1,905.72 |
| కల్లూరు | 1,882.67 |
| ఓర్వకల్లు | 1,838.04 |
| గూడూరు | 1,624.36 |
| సి.బెళగల్ | 895.42 |
| కర్నూలు అర్బన్ | 74.98 |
| కృష్ణగిరి | 2,659.56 |
| దేవనకొండ | 1,018.55 |
| ఆదోని | 1,433.64 |



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా, పక్కన జేసీ, ఆదోని సబ్ కలెక్టర్ తదితరులు

# కర్రల సమరానికి పకడ్బందీ ఏర్పాట్లు

**■ 12వ తేదీన బన్ని ఉత్సవం**

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే : దేవరగట్టు బన్ని ఉత్సవం 12వ తేదీ జరగనున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో దేవరగట్టు బన్ని ఉత్సవ ఏర్పాట్లపై అధికారులు, దేవస్థానం కమిటీ సభ్యులతో కలెక్టర్ శుక్రవారం సమీక్షించారు. కర్రల సమరంతో రక్తపాతం సృష్టించవద్దని కోరారు. సంతోషకరమైన వాతావరణంలో ఉత్సవం జరుపుకోవాలని నాలుగు గ్రామాల తరఫు నుంచి హాజరైన సభ్యులకు సూచించారు. విద్యుత్తు సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. ఉత్సవ పర్యవేక్షణకు వంద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్‌కు చెప్పారు. నెరణికి, దేవరగట్టు రహదారులకు సంబంధించి అవసరమైన చోట ప్యాచ్‌వర్క్‌లు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులకు సూచించారు. అరికెర నుంచి దేవరగట్టు వరకు, నెరణికి నుంచి దేవరగట్టు వరకు రహదారులను పరిశీలించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. అంబులెన్సులు, తాత్కాలికంగా 20 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల

# ప్రభుత్వం పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలి

**■ ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల**

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం పీఆర్సీ కమిషన్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు చెన్నుపాటి మంజుల డిమాండు చేశారు. శుక్రవారం ఎమ్మిగనూరు పట్టణంలోని వీవర్స్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో జోన్ స్థాయి ఏపీటీఎఫ్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైకాపా ప్రభుత్వ హయాంలో జీపీఎస్ పేరుతో సీపీఎస్‌నే మసిపూసి మారేడుకాయ చేసి తిరిగి ప్రవేశపెట్టిందని ఆరోపించారు. తక్షణమే పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. ఖాళీ పోస్టులను పదోన్నతులతో భర్తీ చేయాలన్నారు. జీవో 117తో విద్యారంగం పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి ఉందని, వెంటనే దీన్ని రద్దు చేయాలన్నారు. అశాస్త్రీయ సిలబస్ భారాన్ని తగ్గించాలన్నారు. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులను బోధనకు దూరం చేశారని పేర్కొన్నారు. వైకాపా ప్రభుత్వ విధానాలతో విద్యా వ్యవస్థ పూర్తిగా నాశనమైందన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తులు, రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌కుమార్, నరేష్‌కుమార్, కర్నూలు జిల్లా పూర్వ అధ్యక్షుడు ఏపీ వీరన్న, రామన్న, సోమేశ్వరి, నరసమ్మ, సునీత, వాణి పాల్గొన్నారు.

# చెత్తపన్నుకు చెల్లుచీటీ

వైకాపా హయాంలో ఇంటింటి చెత్త సేకరణ పేరుతో ముక్కుపిండి 'పన్ను' వసూలు చేశారు. చెల్లించకపోతే అపరాధ రుసుము విధించారు.. అనవసర రాద్ధాంతం చేశారు. కాలనీవాసులు తిరగబడితే కుళాయిలు ధ్వంసం చేశారు.. ఇళ్ల ఎదుట చెత్త వేసి వికృత చేష్టలకు పాల్పడ్డారు. విసుగెత్తి ఎదురుతిరిగిన జనం చెత్త బుట్టలు విసిరేసినా మొండి పట్టు వీడక పట్టణ ప్రజలను ముప్పుతిప్పలు పెట్టారు. పుర ప్రజల ఇక్కట్లు గమనించిన 'కూటమి' ప్రభుత్వం చెత్త పన్ను ఎత్తేసింది. పురవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

–ఆదోని పురపాలకం, కర్నూలు నగర పాలక సంస్థ, నంద్యాల పురపాలకం, న్యూస్‌టుడే




**ముక్కుపిండి వసూలు**

వైకాపా ప్రభుత్వం 2022 ఫిబ్రవరి నుంచి ఇంటింటి చెత్త సేకరణ విధానాన్ని తెరపైకి తెచ్చింది. ప్రతి నెలా ముక్కుపిండి మరీ చెత్త పన్ను వసూలు చేసేవారు. ఇంటికి నెలకు రూ. 30-60, వాణిజ్య సముదాయాలు, వ్యాపార సంస్థలు తదితర వాటికి రూ.100 నుంచి రూ.5 వేల దాకా రుసుము విధించారు. వార్డుల వారీగా పురపాలక, సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి వసూలుకు యత్నించింది. చివరికి ప్రభుత్వ పథకాల ద్వారా పొందుతున్న లబ్ధి అయిన సామాజిక పింఛన్లలో కోతలు విధించడం, పొదుపు మహిళల నుంచి పొదుపు మొత్తాల నగదును మళ్లించడం వంటివి చేశారు. ఇలా ఇప్పటి వరకు రూ.15-16 కోట్లు ప్రజల నుంచి చెత్త పన్ను రూపంలో వసూలు చేశారు.

**డోన్ పురపాలిక:** 32 వార్డులు ఉన్నాయి. ఇంటింటి చెత్త సేకరణలో భాగంగా 25వ వార్డును పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఇక్కడ 250కిపైగా గృహాలుండగా, వెయ్యికి పైగానే జనాభా నివసిస్తోంది. 120 వరకు దుకాణాలున్నాయి. తడి, పొడి, హానికర వ్యర్థాలను సేకరించేందుకు ఇంటింటికి 675 బుట్టలను పంపిణీ చేశారు. ఇక్కడ పది నెలలపాటు రూ.37 వేల వరకు చెత్త పన్ను వసూలు చేశారు. తర్వాత ప్రజల నుంచి అభ్యంతరాలు రావడం, పన్నును వ్యతిరేకించడంతో వసూలు నిలిపేశారు.



| పురపాలకం | వార్డులు | వాహనాలు | ప్రస్తుతం తిరుగుతున్నవి | నెలవారీ పన్ను లక్ష్యం | ఇప్పటి వరకు వసూలు |
|---|---|---|---|---|---|
| కర్నూలు | 52 | 100 | 91 | రూ.కోటి | రూ.10 కోట్లు |
| ఆదోని | 42 | 42 | 25 | రూ.16 లక్షలు | రూ.కోటి |
| నంద్యాల | 42 | 50 | 31 | రూ.25 లక్షలు | రూ.15 లక్షలు |
| ఎమ్మిగనూరు | 34 | 30 | 10 | రూ.10 లక్షలు | రూ.కోటి |

**గాడితప్పిన నిర్వహణ**

▸▸ ఉమ్మడి కర్నూలు జిల్లాలో కర్నూలు నగర పాలక సంస్థతో పాటు నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు పురపాలికల్లో ఇంటింటి చెత్త సేకరణకు ఆటోలు కేటాయించారు. మొత్తం నాలుగు పురపాలికల్లో 170 వార్డులున్నాయి. మొదట్లో వార్డుకో ఆటోను కేటాయించారు. ఒక్కో ఆటోకు నెలవారీగా అద్దె రూ.63 వేలు ఉండేది, చివరికి రూ.68 వేలకు పెంచారు. పురపాలికల్లో చెత్త సేకరణకు గతంలోని వాహనాలకు ఇంధన సర్దుబాటు, ఇంటింటి చెత్త సేకరణ ఆటోల అద్దెలు రెండింటి నిర్వహణ తలనొప్పిగా మారింది.

▸▸ ఇంటింటి చెత్త సేకరణ పనులను దక్కించుకున్న గుత్తేదారు ఆటోడ్రైవర్లకు సకాలంలో జీతాలు చెల్లించలేని పరిస్థితి. నెలల తరబడి మొండి బకాయిలుండటంతో వాహన డ్రైవర్లు ఆందోళనలు, సమ్మెబాట పట్టారు. పలుచోట్ల నయానో భయానో సమ్మె విరమించేలా చేశారు. పలుచోట్ల ఎదురుతిరిగిన ఆటోడ్రైవర్లను విధుల నుంచి తొలగించారు. నంద్యాలలో సమ్మెలోకి వెళ్లిన ఆటోలు, సిబ్బంది నేటి వరకు బయటకు రాలేదు. ఆటోలకు అద్దెలు చెల్లించలేక చాలా వార్డుల్లో నిలిపేస్తూ వచ్చారు. మొత్తం 222 ఆటోలకుగాను ప్రస్తుతం 157 తిరుగుతున్నాయి.

# ప్రయాణికుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: దసరా పండగ నేపథ్యంలో హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, చెన్నై, విజయవాడల నుంచి కర్నూలుకు వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు 81 బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి టి. శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. కర్నూలు నుంచి ఆయా ప్రాంతాలకు తిరుగు ప్రయాణానికి సైతం ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు 83 బస్సులు నడుపుతున్నట్లు వివరించారు. ఈ బస్సులకు ప్రయాణికుల నుంచి ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయడం లేదని వెల్లడించారు. ముందస్తుగా రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులకు ఛార్జీలో 10 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


ఆదోని: మంగళగౌరిగా అంబాభవానీ


కర్నూలు: నిమిషాంబ ఆలయంలో శక్తిమాత


ఆలూరు: జ్వాలామాలిని దేవిగా కన్యకాపరమేశ్వరి


మంత్రాలయం: ధనలక్ష్మి అలంకరణలో మంచాలమ్మ


కె.నాగలాపురంలో గాయత్రీదేవి

# దుష్ట సంహారిణి... దుర్గారూపిణి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. కొలువుదీరిన అమ్మవార్లను భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు నిర్వహించారు. నీ ఆశీర్వచనాలే మాకు రక్ష... కాపాడుతల్లీ.. అంటూ మనసారా పూజించారు. పలు ఆలయాల్లో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.
-న్యూస్‌టుడే బృందం


ఎమ్మిగనూరు: కన్యకాపరమేశ్వరి కోవెలలో గాయత్రిదేవి అలంకరణ


శ్రీశైలం ఆలయం: శంఖు, ఢమరుక నాదాలతో సందడి


శ్రీశైలం ఆలయం: నృత్యం చేస్తున్న కోయ గిరిజనులు


శ్రీశైలం ఆలయం: మయూర వాహనంపై కొలువైన స్వామిఅమ్మవార్లు


శ్రీశైలం ఆలయం: కేరళ వాయిద్యాలతో ఆకట్టుకుంటున్న కళాకారులు


శ్రీశైలం ఆలయం: కన్నడ కళాకారుల సందడి

## అకస్మాత్తుగా వర్షం..
# కర్షకునికి కష్టం

ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్లో శుక్రవారం మధ్యాహ్నం అకస్మాత్తుగా సుమారు 20 నిమిషాలపాటు వర్షం కురిసింది. దీంతో టెండర్‌కు పెట్టిన వేరుశనగ దిగుబడులు తడవకుండా రైతులు అప్రమత్తమయ్యారు. మార్కెట్‌కు 9,614 వేరుశనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. మార్కెట్ అధికారులు అధిక శాతం దిగుబడులను రేకుల షెడ్లు కింద కుప్పలుగా పోయించారు. యార్డులో అక్కడక్కడ రాసులుగా వేసిన వేరుశనగ ఉత్పత్తులపై కప్పేందుకు అధికారులు రైతులకు టార్పాలిన్లు అందజేశారు. అయినా కుప్పల అంచుకు కొంతమేర దిగుబడులు తడిశాయి.
- న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు వ్యవసాయం


మార్కెట్లో వేరుశనగ తడవకుండా కప్పిన టార్పాలిన్లు
ఆదోని మార్కెట్లో

## కృష్ణగిరిలో 48.2 మి.మీ.ల వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా గురువారం నుంచి శుక్రవారం ఉదయం వరకు 25 మండలాల్లో వర్షం కురిసింది. కృష్ణగిరిలో అత్యధికంగా 48.2 మి.మీ.గా నమోదైంది. ఆలూరు 25.6, కల్లూరు 24.8, ఓర్వకల్లు 22.4, వెల్దుర్తి 20.4, ఆస్పరి 19.6, దేవనకొండ 17.8, పత్తికొండ 17.4, ఆదోని 15.8, గూడూరు 15, హొళగుందలో 13.2 మి.మీ. పడింది. కర్నూలు రూరల్ 12.8, తుగ్గలి 11.4, కర్నూలు అర్బన్ 11.2, మద్దికెర 9.4, నందవరం 8.0, పెద్దకడబూరు 7.6, కోడుమూరు 6.6, కోసిగి 5.8, సి.బెళగల్ 4.4, గోనెగండ్ల, మంత్రాలయం, ఎమ్మిగనూరు 2.4, చిప్పగిరి 2.0, హాలహర్విలో 1.0 మి.మీ.గా నమోదైంది. జిల్లా సగటున 12.6 మి.మీ.గా ఉంది. ఈనెల సాధారణ వర్షపాతం 110.2 మి.మీ. కాగా ఇప్పటివరకు 16.4 మి.మీ.గా నమోదైంది.

## పండగకు ముందే..
# కదిలిన వలస బండి

పశ్చిమ ప్రాంత రైతులు, కూలీలు ఏటా దసరా పండగ జరుపుకొన్న తర్వాత వలస బాట పట్టేవారు. కానీ కోసిగి నుంచి 60 కుటుంబాల వారు దసరాకు 9 రోజులు ముందుగానే వలసకు బయలుదేరారు. రెండు బొలెరోల్లో తెలంగాణ రాష్ట్రానికి పిల్లాపాపలు, మూటాముల్లె సర్దుకుని వెళ్లిపోయారు. వర్షాలున్నా.. స్థానికంగా ఉపాధి పనులు కూడా లేకపోవడంతో కూలీలు అధికారులపై మండిపడుతున్నారు.
- న్యూస్‌టుడే, కోసిగి



# ఇష్టం లేకున్నా.. కష్టంగా విధులు

- జిల్లా విద్యాశాఖలో ఇన్‌ఛార్జుల పాలన
- కొరవడిన పాఠశాలల పర్యవేక్షణ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను పటిష్ఠం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఆ దిశగా జిల్లా అధికారులు ప్రణాళికలు రూపొందించుకొని ముందుకు సాగాల్సి ఉంది. అయితే.. జిల్లా విద్యాశాఖలో కీలకమైన పోస్టుల్లో ఇన్‌ఛార్జులు ఉండటంతో పాఠశాలల పర్యవేక్షణ, ఉత్తీర్ణతపై ప్రభావం చూపుతోందని విద్యావేత్తలు చెబుతున్నారు. గత ప్రభుత్వం ఉపాధ్యాయులను ఇబ్బంది పెట్టిన విషయం తెలిసిందే. దీనికి భయపడి జిల్లా కేంద్రంలోని పోస్టుల్లో ఫారిన్ సర్వీస్ పద్ధతిలో విధులు నిర్వహించేందుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈ ప్రభుత్వంలోనైనా ఇన్‌ఛార్జుల పాలనకు ముగింపు ఉంటుందని పలువురు ఉపాధ్యాయులు ఆశిస్తున్నారు. రెగ్యులర్ అధికారులుంటే బడుల్లో జరిగే ప్రతి విషయాన్ని క్షుణ్నంగా పరిశీలించడంతోపాటు సమస్యల పరిష్కారానికి వీలుంటుందని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

### ఉమ్మడి జిల్లాలో
### 23 ఎంఈవో పోస్టులు ఖాళీ

నంద్యాల జిల్లాలో ఎంఈవో-1 పోస్టులు 12, ఎంఈవో-2 పోస్టులు 3, కర్నూలు జిల్లాలో ఎంఈవో-1 పోస్టులు 7, ఎంఈవో-2 పోస్టు ఒకటి ఖాళీగా ఉంది. ఈ పోస్టులు గతేడాది నుంచి ఖాళీగానే ఉన్నాయి. కొన్నిచోట్ల సీనియర్ ప్రధానోపాధ్యాయులకు పాలనాపరంగా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించినట్లు సమాచారం. కర్నూలు జిల్లాలో ఎంఈవో-1 హోదాలో ఆదోని, హొళగుంద, కోసిగి, కౌతాళం, ఓర్వకల్లు, పత్తికొండ, తుగ్గలి మండలాలు, ఎంఈవో-2 కౌతాళం మండలాలు ఖాళీగా ఉన్నాయి. అలాగే నంద్యాల జిల్లాలో ఎంఈవో-1 హోదాలో ఆత్మకూరు, దొర్నిపాడు, గడివేముల, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, కొత్తపల్లి, మిడుతూరు, ప్యాపిలి, రుద్రవరం, సంజామల, ఉయ్యాలవాడ, నందికొట్కూరు మండలాలు, ఎంఈవో-2 హోదాలో బేతంచెర్ల, డోన్, మహానంది మండలాలు ఖాళీగా ఉన్నాయి. ఈ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల పర్యవేక్షణ సరిగా లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

### మేం నిర్వహించలేం?

ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో జరిగే ప్రతి పరీక్షకు సంబంధించిన ప్రశ్నపత్రాల రూపకల్పన, పత్రాల సరఫరా విషయంలో డీసీఈబీ విభాగం ఎంతో కీలకం. ఈ పోస్టులో గూడూరు ఎంఈవో-2 నాగరాజు డీసీఈబీ జిల్లా ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అక్కడ, ఇక్కడ పూర్తి స్థాయిలో విధులు నిర్వహించలేక ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో లేకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక వనరులు లేకపోవడంతో ఈ పోస్టులో మేము విధులు నిర్వహించలేమని అధికారుల ఎదుట ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. సి.బెళగల్ ఎంఈవో-2 ఆదాం బాషా కూడా ఉర్దూ పాఠశాలలకు జిల్లా ఇన్‌ఛార్జి అధికారిగా ఉన్నారు. ఈయన కూడా నేరుగా డీఈవోను కలిసి ఈ పోస్టులో నేను విధులు నిర్వహించలేనని పలుమార్లు లేఖ సమర్పించారు. ఈ రెండు హోదాలు విద్యా శాఖలో కీలకమైనవి. వీటిని భర్తీ చేస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేందుకు వీలుంటుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### పెండింగ్‌లో దస్త్రాలు

కర్నూలు మండలం ఎంఈవో-1 హనుమంతరావును కర్నూలు డివిజన్ డిప్యూటీ ఈవోగా ఇన్‌ఛార్జి బాధ్యతలు ఇచ్చారు. ఈయన మూడేళ్ల నుంచి ఉన్నారు. కర్నూలు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఏదైనా జరిగిన ఘటనపై విచారణ అధికారిగా ఎక్కువ శాతం ఈయననే నియమిస్తున్నారు. ఎంఈవో-1 బాధ్యతలు ఉండటంతో విచారణ అంశాలను వాయిదా వేస్తున్నట్లు తెలుస్తోంది. డిప్యూటీ ఈవో ఇక్కడ లేకపోవడంతో ఇదే కార్యాలయంలో విధులు నిర్వహించే ఓ అధికారి ఇష్టారీతిగా పని చేస్తున్నట్లు సమాచారం. ఈయనపై ఆర్‌జేడీకి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.


కుమారుడికి అన్నం తినిపిస్తున్న తల్లి జయలక్ష్మి

# ఇల్లాలి గుండెలో కన్నీటి కడలి

- కదల్లేని స్థితిలో భర్త, కొడుకు
- ఇద్దరినీ కంటికి రెప్పలా కాస్తున్న జయలక్ష్మి

ఆ తల్లిని కదిలిస్తే.. కన్నీటి కడలి కదిలొస్తుంది. అనుక్షణం భర్త వెన్నంటే ఉంటాడకున్నారు.. వెన్ను కదల్లేక ఉండిపోయారు. కన్నకొడుకు మాటలు వినాలన్న సంబరం.. ఆమెకు దరిచేరలేదు. బాలుడి పరిస్థితి చూసి కన్నపేగు విలవిల్లాడింది. భర్త దీనావస్థతో నిత్యం వేదనకు గురవుతోంది. ఇద్దరికీ సపర్యలు చేయడంతోనే సమయం సరిపోతోంది.. కూలి పనులకు వెళ్లలేక జీవనం భారంగా సాగుతోంది. ఆ మహిళ వేదనను చూసి విధిసైతం విలపిస్తోంది. పత్తికొండ మండలం హోసూరుకు చెందిన జయలక్ష్మి దీనగాథ ఇది.
- న్యూస్‌టుడే, పత్తికొండ గ్రామీణం

పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఊరు బావి వీధిలో నివాసం ఉంటున్నారు. జయలక్ష్మి, పెద్దయ్య. కుమారుడు ఎర్రిస్వామి. కూలీనాలి చేసుకుని కుటుంబాన్ని పోషించేవారు. ఉన్నంతలో వారు ఆనందంగా గడిపారు. కుమారుడి ముద్దు ముద్దు మాటలు అల్లరి ఆటలతో తల్లిదండ్రులు పొంగిపోయారు. ఉన్న ఊరిలోని పాఠశాలకు సైతం పంపారు. బాలుడు ఏడేళ్ల వయసులో చిన్నపాటి అనారోగ్యానికి గురయ్యారు. స్థానిక వైద్యులకు చూపించారు. చిన్నపాటి అనారోగ్యమే పెద్ద జబ్బుగా మారి అతని జీవితాన్ని అతలాకుతలం చేస్తుందని ఆ తల్లిదండ్రులు ఊహించలేకపోయారు. కొన్ని రోజులకే కుమారుడి అడుగు ఆగిపోయింది. . గొంతు మూగబోయింది. ఇదంతా చూసి తల్లిదండ్రులకు గుండె భారంగా మారింది. వెళ్లని ఆసుపత్రి లేదు.. సంప్రదించని వైద్యులు లేరు. బాలుడి ఆరోగ్యం కుదుట పడకపోగా.. రోజురోజుకు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వైద్యం కోసం రూ.5లక్షలకు పైగా ఖర్చు చేసినా ఎలాంటి ఫలితం దక్కలేదు. కొడుకు పరిస్థితి చూసి కన్నీరు ఆగలేదు. చేసేది లేక దుఃఖాన్ని దిగమించి కూలిపనులకు వెళ్తూ.. బతుకు జీవుడా అంటూ కాలం గడపసాగారు.

### మళ్లీ మరో పిడుగు

అసలే కుమారుడి పరిస్థితో పుట్టెడు దుఃఖంలో ఉన్నారు. అలాంటి సమయంలో మరో


మంచానికి పరిమితమైన పెద్దయ్య

కుదుపు. ఓ గొర్రెల వ్యాపారి దగ్గర కూలిపనులకు వెళ్లారు జయలక్ష్మి భర్త పెద్దయ్య. తాడిపత్రి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రికి తరలిస్తే అతని వెన్నెముక పూర్తిగా దెబ్బతిందని చెప్పడంతో ఆమె వెన్నులో వణుకుపుట్టింది. కంటనీరు ఆగలేదు. ఆయన కదలడం కష్టమని వైద్యులు తేల్చిచెప్పారు. భర్త వైద్యానికి మరో ఐదు లక్షలు ఖర్చు చేసినా.. ఏ మాత్రం ఫలితం లేకుండా పోయింది. అటు కుమారుడి వైద్యానికి, ఇటు భర్త మందులకు నెలకు కనీసం రూ.10వేలకు పైగానే ఖర్చు తప్పడం లేదు. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి. ప్రభుత్వం నుంచి కుమారుడికి వచ్చే రూ.6వేల పింఛను ఏమాత్రం అవసరాలు తీడం లేదు. ఒకే రేషన్‌కార్డులో ముగ్గురు కుటుంబ సభ్యులు ఉండటంతో.. సాంకేతికంగా ఇద్దరికి పింఛన్ అందించడం ఇబ్బందిగా మారింది. వారి ఆలనా పాలనా ఆమెకు భారంగా మారింది. కుటుంబ పరిస్థితి అర్థం చేసుకొని కుమారుడికి, భర్తకు పింఛను అందేలా చూడాలని జయలక్ష్మి కన్నీటిపర్యంతం అవుతున్నారు.

# వైకాపా శ్రేణుల దాడి హేయం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలైన కర్నూలు, అనంతపురం, వైఎస్సార్ జిల్లాల్లోని నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే మామూళ్ల కోసం వైకాపా వారు కాంట్రాక్టర్లపై దాడులు చేస్తున్నారని కర్నూలు పార్లమెంటు నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఆలూరు నియోజకవర్గంలో వైకాపా ఎమ్మెల్యే అనుచరులు రెన్యూ విండ్ పవర్ గ్రీన్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టుకు సంబంధించిన


మాట్లాడుతున్న తిక్కారెడ్డి, పక్కన సోమిశెట్టి, నాయకులు

కార్యాలయంపై దాడులకు చేయడం దారుణమన్నారు. కాంట్రాక్టర్లు వైకాపా ఎమ్మెల్యే అనుచరులు అడిగినమేరకు లంచాలు ఇవ్వడం లేదని ఆలూరు సమీపంలోని పవన విద్యుత్తు కార్యాలయంపై దాడులు చేశారని చెప్పారు. అధికారం కోల్పోయినా వారికి ఇంకా బుద్ధి రాలేదని ధ్వజమెత్తారు త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు ప్రారంభమవుతుందని, జిల్లాలో ఈసారి ఎక్కువ శాతం సభ్యత్వాలు నమోదు చేసి జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, నాయకులు ఆకెపోగు ప్రభాకర్, నాగరాజు యాదవ్, పి.హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధులు తమకు అవసరమైన సహాయ పరికరాల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతుల జిల్లా మేనేజర్ ఫాతిమా శుక్రవారం సూచించారు. మరిన్ని వివరాలకు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## టెట్‌కు 155 మంది గైర్హాజరు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: టెట్ (ఉపాధ్యాయ అర్హత పరీక్ష) పరీక్షకు 155 మంది అభ్యర్థులు గైర్హాజరైనట్లు డీఈవో శామ్యూల్ శుక్రవారం తెలిపారు. మొత్తం 1,268 మంది అభ్యర్థులకు గాను 1,113 మంది పరీక్షకు హాజరైనట్లు వెల్లడించారు.

## నేటి నుంచి కళాశాలలకు సెలవులు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలకు శనివారం నుంచి ఈ నెల 13వ తేదీ వరకు దసరా సెలవులు ఇస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించినట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి శుక్రవారం తెలిపారు. కళాశాలలు ఈ నెల 14వ తేదీన పునః ప్రారంభం కానున్నట్లు చెప్పారు. దసరా సెలవుల్లో కళాశాలల యజమాన్యాలు విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## విజయవాడ వరద బాధితులకు చేయూత

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ప్రజలకు కష్టం వస్తే ముందుగా సాయం చేసేందుకు ఆర్యవైశ్యులు వస్తారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి మంత్రి టి.జి భరత్ అన్నారు. విజయవాడలోని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవోపా మహిళా విభాగ్ ఆధ్వర్యంలో శుక్రవారం వరద బాధితులకు నగదు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంత్రి బాధితులకు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున చెక్కులను అందించారు. అసోసియేషన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఆరవేటి నిర్మల, రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు, కర్నూలుకు చెందిన ఆవోపా రాష్ట్ర చీఫ్ కో ఆర్డినేటర్ మలిపెద్ది నాగేశ్వరరావు, చలువాది మల్లికార్జున, వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.


మంత్రికి జ్ఞాపికను అందజేస్తున్న ఆవోపా ప్రతినిధులు

## రైతులకు మేలు జరిగేలా పత్తి కొనుగోళ్లు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: రైతులకు మేలు చేకూర్చే విధంగా పత్తి కొనుగోళ్లు చేపట్టి రైతులకు చెల్లించాల్సిన మొత్తం వెంటనే చెల్లించాలని జేసీ డా.బి నవ్య సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ప్రతినిధులను ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్‌లోని మిని కాన్ఫరెన్సు హాల్‌లో డీఎల్‌పీసీ (జిల్లా స్థాయి పర్చేజ్ కమిటీ) సభ్యులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో జేసీ మాట్లాడారు. గ్రామస్థాయిలో పత్తి రైతుల వివరాలను వీఏఏ ద్వారా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేయించాలని వ్యవసాయశాఖ జేడీ పీఎల్ వరలక్ష్మిని జేసీ ఆదేశించారు. పత్తి కొనుగోలుకు తగిన సౌకర్యాలు కల్పించడంతో పాటు పత్తి నాణ్యతపై రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి నారాయణమూర్తిని, వ్యవసాయ మార్కెట్ కమిటీల కార్యదర్శులకు సూచించారు. జిన్నింగ్ మిల్లుల వారు కంప్యూటర్, నెట్, సీసీ కెమెరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సమావేశంలో వ్యవసాయ, మార్కెటింగ్, డీటీసీ, సీసీఐ సెంటర్ ఇన్‌ఛార్జులు, పత్తి వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## 24 మంది నిందితుల అరెస్టు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పవన విద్యుత్తు ఉప కేంద్రాలు, కార్యాలయాలపై దాడులకు పాల్పడిన కేసులో 24 మందిని అరెస్టు చేసినట్లు ఆలూరు ఎస్సై సీవీ నరసింహులు తెలిపారు. ఆస్పరి మండలం బిల్లేకల్లు గ్రామ క్రాస్ వద్ద ఎమ్మెల్యే విరూపాక్షి సోదరుడు వెంకటేష్‌తో పాటు దేవనకొండ జడ్పీటీసీ సభ్యుడు కిట్టు అలియాస్ రామకృష్ణ, ఆస్పరి మండలం బిణిగేరి సర్పంచి వెంకటేశతో పాటు మరో 21 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. వారిని న్యాయమూర్తి ఎదుట హాజరు పరచగా.. వారికి రిమాండ్ విధించినట్లు తెలిపారు. కాగా వీరందరిపై ఆస్పరి, దేవనకొండ పోలీసు స్టేషన్‌లలో సైతం కేసు నమోదయ్యాయి.

## కర్నూలు అటవీ సీసీఎఫ్ బదిలీ

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: కర్నూలు సర్కిల్ కార్యాలయంలో చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్టర్ విధులు నిర్వర్తిస్తున్న పి.రామకృష్ణను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను గుంటూరులోని ఏపీ స్టేట్ బయోడైవర్సిటీ బోర్డు సభ్యుడిగా బదిలీ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అనంతపురం సర్కిల్ సీఎఫ్ యశోదాబాయికి కర్నూలు సర్కిల్ సీఎఫ్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

## కుండపోత వర్షం.. రహదారులు జలమయం



పత్తికొండ పట్టణం: గాలివానకు డిగ్రీ కళాశాల ఆవరణలో పడిపోయిన చెట్టు

ఆదోని మార్కెట్, పత్తికొండ పట్టణం న్యూస్‌టుడే: ఆదోని, పత్తికొండ పట్టణాల్లో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి జనజీవనం స్తంభించిపోయింది. పత్తికొండ పట్టణంలో రహదారులపై నీరు ప్రవహించింది.

## రైతులకు అవగాహన కల్పించాలి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బంది నింతరం అందుబాటులో ఉంటూ.. సాగులో మెలకువలు వివరించాలని పత్తికొండ ఏడీఏ మోహన్ విజయ్‌కుమార్, బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మౌనిక, చందన, జిల్లా వనరుల కేంద్రం అధికారులు మాధురి, హేమలత అన్నారు. పత్తికొండ పట్టణంలోని రైతు సేవా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందికి నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శిక్షణ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి దస్తగిరి, వ్యవసాయ విస్తరణాధికారులు రియాజ్, యోగేంద్ర, హనుమన్న తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ ఉద్యోగులకు సన్మానం

తుగ్గలి, న్యూస్‌టుడే: తుగ్గలి ఎంపీడీవోగా పనిచేస్తూ బదిలీపై దొర్నిపాడు మండలానికి వెళ్తున్న ఎంపీడీవో సావిత్రి, ఆస్పరి మండలానికి బదిలీపై వెళ్తున్న ఉపాధి ఏపీవో రామకృష్ణను మండల పరిషత్తు, ఉపాధి సిబ్బంది శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మల్లికార్జునరెడ్డి మాట్లాడారు.

## 6న బాలగోపాల్ సంస్మరణ సభ

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: మానవ హక్కుల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో డాక్టర్ బాలగోపాల్ సంస్మరణ సభ నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర అధ్యక్షుడు యూజీ శ్రీనివాసులు అన్నారు. ఆదోనిలో శుక్రవారం బాలగోపాల్ సంస్మరణ సభకు సంబంధించిన గోడపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేదిక రాష్ట్ర కార్యదర్శి దేవేంద్రబాబు, జిల్లా అధ్యక్షుడు ఉరుకుందప్ప, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంపై దృష్టి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: వెల్దుర్తి ఎంపీడీవోగా సుహాసినమ్మ, ఈవోఆర్డీగా రవికిషోర్, వెల్దుర్తి పంచాయతీ ఈవోగా తారకేశ్వరి, జూనియర్ సహాయకుడిగా వెంకట్రాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. పారిశుద్ధ్యపనులు, తాగునీరు విషయాలలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో కోరారు.

## అక్కినేని కుటుంబానికి క్షమాపణ చెప్పాలి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అక్కినేని కుటుంబానికి కొండా సురేఖ దంపతులు క్షమాపణ చెప్పాలని అక్కినేని అభిమానుల సంఘం రాయలసీమ జిల్లాల కార్యదర్శి షేక్‌ఉస్మాన్‌బాషా అన్నారు. నిరాధారమైన వ్యాఖ్యలతో అక్కినేని కుటుంబాన్ని క్షోభకు గురిచేసిన వారు వెంటనే క్షమాపణ కోరి మరోసారి ఇలాంటి మాటాలు పునారావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో అక్కినేని అభిమాన సంఘం నాయకులు ఈశ్వర్, మహేశ్, బాషా, వెంకటేష్, చలపతి, అనిల్, గౌరిశంకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

## సిబ్బంది నియామకం.. సభ్యుల అభ్యంతరం

☛ అధికారుల నిర్ణయంపై వైకాపా ఆగ్రహం

☛ నీటి సరఫరా విభాగంలో కొరత తీరేదెలా

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలో తాగునీటి విభాగంలో రోజుకో సమస్య. ప్రతి వార్డులో నీటి లీకేజీలు తలెత్తుతున్నాయి. నిర్వహణ సరిగా ఉండటం లేదు. పెరుగుతున్న జనాభా అనుగుణంగా ఇంజినీరింగ్, నీటి విభాగంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ సమస్యలను అధిగమించాలంటే.. అదనపు సిబ్బందిని నియమించాలని పురపాలక అధికారులు భావిస్తున్నారు. నియామకంపై వైకాపా సభ్యులు అడ్డుకట్ట వేస్తున్నారు.

### నిర్వహణలో సమస్యలు

పట్టణంలో నీటి సరఫరా గొట్టాలు 167 కి.మీ. విస్తరించి ఉన్నాయి. శుద్ధజల కేంద్రం దూరం 8.50 కి.మీ. శుద్ధజల కేంద్రం నుంచి ఉపరితల నీటి కుంటల మధ్య దూరం 12 కి.మీ. ఉంది. సిబ్బంది కొరత కారణంగా నీటి సరఫరా నిర్వహణతో పాటు నీటి లీకేజీలు, పైపులైన్ల మరమ్మతులు, చేతిపంపులు, బోర్ల మరమ్మతు, ఈఎల్ఎస్ఆర్ ట్యాంకులు, మొక్కలు, వీధి దీపాలు, నీటి నిర్వహణకు సిబ్బంది కొరత వేధిస్తోందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో అదనపు సిబ్బంది నియమాకానికి అవకాశాలుండటంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం ఉన్న సిబ్బంది సక్రమంగా పనిచేయడం లేదని, ఇప్పటికే ఉన్న వారు కనీసం విధుల్లో కనిపించడం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి.

### జనాభాకు అనుగుణంగా..

పట్టణంలో 42 వార్డుల్లో ఇంజినీరింగ్, నీటి విభాగంలో 28 శాశ్వత, 85 మంది పొరుగు సేవల కింద మొత్తం 113 మంది సిబ్బంది పనిచేస్తున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రతి వెయ్యి మంది జనాభాకు ఒకరు చొప్పున 166 మంది అవసరం. ప్రస్తుతం ఉన్నది 113, ఈ లెక్కన 53 మంది సిబ్బంది కావాలి. దీంతో 53 మందిని నియమించాలని నిర్ణయించారు.



నీటి లీకేజీలు

| | |
|---|---|
| పట్టణం: | ఆదోని |
| వార్డులు: | 42 |
| జనాభా: | 1,66,344 |
| కుటుంబాలు: | 33,269 |
| విస్తీర్ణం: | 38.16 చ.కి.మీ. |

### ఎందుకంటే..

సిబ్బంది కొరతతో పట్టణవాసులకు తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయి. సమస్యలను అధిగమించాలని అధికారులు భావించారు. తమకు తెలియకుండా ఏకంగా అజెండాలో ఎలా పొందుపరుస్తారని వైకాపా సభ్యులు అభ్యంతరం తెలుపుతున్నారు. నియామకంపై వారి అభ్యంతరం వెనుక ఇంకేమైనా కారణాలు ఉన్నాయనే అనుమానాలు తలెత్తుతున్నాయి.

## విండ్‌పవర్ కార్యాలయంపై దాడి దారుణం

ఆస్పరి, న్యూస్‌టుడే: రెన్యూగ్రీన్ ఇన్నో గాలి మర కంపెనీ కార్యాలయంపై ఎమ్మెల్యే అతడి అనుచరులు దాడులు చేయడం దారుణమని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం మండల కార్యదర్శి ఆధ్వర్యంలో సమావేశంలో వారు మాట్లాడారు. నాయకులు నాగేంద్రయ్య, విరుపాక్షి, ఆంజనేయ్య పాల్గొన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) ఆదోని: 77996 66004 ఆలూరు: 80085 62277 పత్తికొండ: 8008573822

చిప్పగిరి, న్యూస్‌టుడే: సమస్య: చిప్పగిరి బస్టాండ్ వద్ద ఉన్న గుంతలో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. మురుగు నీరు బయటకు వెళ్లేలా కాల్వ ఏర్పాటు చేయాలి. - నారాయణ, చిప్పగిరి

సమాధానం: మురుగు కాల్వ ఏర్పాటుకు నిధులు ఉన్నాయి. త్వరలో తీర్మానం చేసి మురుగు నీరు మళ్లించేందుకు చర్యలు తీసుకుంటాం. - దాసరి గోవిందరాజులు, సర్పంచి చిప్పగిరి

హొళగుంద, న్యూస్‌టుడే: సమస్య: మార్లమడికి గ్రామ ప్రధాన రహదారిలోని మురుగు కాల్వలో పూడిక పేరుకుపోయింది. మురుగు కదలక దోమల బెడద ఎక్కువైంది. - హనుమంతు, మార్లమడికి

సమాధానం: పారిశుద్ధ్య కార్మికులతో శుభ్రం చేయిస్తాం. - షఫి, పంచాయతీ కార్యదర్శి

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: సమస్య: చందోలి గ్రామంలో ఎక్కడ చూసినా మురుగు రహదారులపై చేరుతోంది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో పాటు దుర్వాసన వ్యాపిస్తోంది. వ్యాధులు వ్యాపిస్తున్నాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలి. - బోయగేరి కాలనీ ప్రజలు, చందోలి

సమాధానం: గ్రామంలో రహదారులు ఏర్పాటు చేసే సమయంలో మురుగు కాల్వలు నిర్మించలేదు. నీరు పారే వీల్లేక దారిపై నిలుస్తోంది. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతు చేపడతాం. - పవన్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, చందోలి

## ఉద్యమాల శక్తి సీతారాం ఏచూరి

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ఉద్యమాల శక్తి అని, మతోన్మదానికి వ్యతిరేకంగా పోరాటం సాగించారని సీపీఎం



రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, వామపక్ష, కాంగ్రెస్ నాయకులు అన్నారు. ఆదోని రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ప్రజా ఉద్యమాల అగ్రనేత సీతారాం ఏచూరి సంస్మరణ సభ సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఆయన చిత్రపటానికి సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దేవిశెట్టి ప్రకాశ్, అజయ్‌బాబు, మల్లికార్జున, వెంకటేశులు, ఈరన్న, మహనందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## రాయితీ శనగ విత్తనాల పంపిణీ

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న శనగ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల తెదేపా కన్వీనర్ అశోక్‌యాదవ్, మొలగవల్లి సర్పంచి మోహన్‌రాజు, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ రాంనాథ్‌యాదవ్‌లు సూచించారు. ఈ సందర్భంగా రైతులకు రాయితీ విత్తనాలను శుక్రవారం అందజేశారు. నాయకులు హనుమప్ప, వెంకటేశ్, ప్రసాద్, విశ్వతేజ పాల్గొన్నారు.

## ఐటీతో ఉజ్వల భవిష్యత్తు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే : ఐటీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆదర్శ పాఠశాల ప్రధానాచార్యుడు రాఘవరావు, ఐటీ వృత్తి విద్య అధ్యాపకుడు ప్రకాశ్‌లు తెలిపారు. ఆలూరులోని శ్రీసాయి కృష్ణ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో శుక్రవారం పది, ఇంటర్ విద్యార్థులకు ఇండస్ట్రీ, ఐటీ కంపెనీలో భవిష్యత్తు గురించి ఇన్‌స్టిట్యూట్ కరస్పాండెంట్ మురళీ విద్యార్థులకు వివరించారు. పది రోజులపాటు విద్యార్థులకు పైథాన్ ప్రోగ్రాం, డిజిటల్ డాక్యుమెంటేషన్‌లపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

ఆలూరు, న్యూస్‌టుడే : విద్యార్థి దశ నుంచే కంప్యూటర్ విద్యపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలని ఆదర్శ పాఠశాల వృత్తి విద్య ఉపాధ్యాయుడు ప్రకాశ్ సూచించారు. వృత్తి విద్యలో భాగంగా పాఠశాలకు చెందిన పది, ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు స్థానిక ఓ కంప్యూటర్ కేంద్రంలో శుక్రవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## చికిత్స పొందుతూ రైతు మృతి

☛ అత్త ఆస్తి దక్కకపోవడంతో ఆత్మహత్యాయత్నం

కణేకల్లు, న్యూస్‌టుడే: అప్పుల బాధ, అత్త ఆస్తి దక్కదన్న మనస్తాపంతో మండలంలోని ఎన్.హనుమాపురం గ్రామానికి చెందిన రైతు లాల్‌మోహన్ (43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కర్నూలు జిల్లా పెరవలిలో చోటు చేసుకొంది. ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. గ్రామస్థుల కథనం మేరకు వివరాలిలా.. కర్నూలు జిల్లా పత్తికొండ నియోజకవర్గం పెరవలికి చెందిన లక్ష్మీదేవికి ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె లావణ్యతో లాల్‌మోహన్ వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. మండలంలోని నాగేపల్లి సమీపంలో 18 ఎకరాల పొలం ఉంది. ఏటేటా పంట దిగుబడులు రాకపోవడం, ఇంటి అవసరాల కోసం రూ.18 లక్షల వరకు అప్పులున్నట్లు సమాచారం. ఆరు రోజుల కిందట అనారోగ్యంతో అత్త మృతిచెందారు. మూడు రోజుల కార్యక్రమం అనంతరం ఆస్తి పంపకాల విషయమై చర్చ జరిగింది. ప్రస్తుతం అత్త పేరున విలువైన ఇల్లు ఇతర ఆస్తులున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో గతంలోనే తనకున్న ఆస్తి ఇద్దరి కుమార్తెలకు సమానంగా పంచింది. అత్త ఆస్తిలో వచ్చిన వాటాతో అప్పులు తీర్చాలనుకున్న లాల్‌మోహన్‌కు అత్త మృతి అనంతరం చుక్కెదురైంది. దీంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలన్న మనస్తాపంతో మూడు రోజుల కిందట పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కర్నూలు జిల్లా మద్దికెర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## క్రీడాకారులకు ప్రోత్సాహం అవసరం



ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోనిలో యువతకు క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి, స్టేడియం నిర్మించాలని తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్ చౌదరి, తెదేపా యువ నాయకులు మారుతినాయుడు, లోకేష్, వినయ్, జేపీ వెంకటేశ్ కోరారు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (ఎస్ఏపీ) ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రవి నాయుడును ఆదోని నాయకులు కలిశారు.

## ఫుట్‌బాల్ బరి.. గోల్‌పైనే గురి

☛ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన లాస్య



ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: బరిలో ఉన్నంత సేపు గెలుపుపైనే గురి. ఫుట్‌బాల్ ఆట అంటేనే వేగంతో పోటీపడాలి. కాళ్లను కదుపుతూ.. గోల్‌వైపు దూసుకెళ్లాలి. ప్రత్యర్థులను అయోమయానికి గురిచేయాలి. వ్యూహాలతో ఓటమిపాలు చేయాలి. అలాంటి ఆటలో ఆదోని పట్టణానికి చెందిన లాస్య విశేషంగా రాణిస్తోంది. జిల్లా స్థాయిలో ప్రతిభచాటి రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైంది.

### చదువు ఆరు.. ఆటలో జోరు

☛ ఆదోని పట్టణం మేదరగేరికి చెందిన శివలింగన్న, శిరిష దంపతుల కుమార్తె ఆర్.లాస్య ఆదోని మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతి చదువుతోంది. రెండేళ్లుగా ఫుట్‌బాల్ క్రీడలో సాధన చేస్తోంది. పాఠశాలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు నరసయ్య, ముజాయిద్దిన్, ఈశ్వరమ్మ క్రీడాకారిణి లాస్యకు మరింత శిక్షణ ఇచ్చారు. ఫార్వర్డ్ ప్లేయరుగా బరిలో దిగితే తన కాళ్లతో బంతిని డ్రిబ్లింగ్ చేస్తూ.. ప్రత్యర్థులకు చుక్కలు చూపుతూ.. బోల్తా కొట్టిస్తూ.. గోల్స్ కొడుతూ.. దూసుకుపోతోంది. ఈ క్రీడాకారిణి ప్రతిభను గుర్తించిన జిల్లా సెలక్టర్లు అండర్-14 ఫుట్‌బాల్ జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననుంది. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని గుర్తింపు చాటడమే తన లక్ష్యమని చెబుతోంది క్రీడాకారిణీ లాస్య.

## అమ్మవారి రూపం.. ఆధ్యాత్మిక దీపం



ఆదోని గ్రామీణం: నెట్టేకల్లులో బ్రహ్మచారిణి అలంకరణ – న్యూస్‌టుడే, బృందం

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ఆదోని, ఆలూరు, పత్తికొండ నియోజకవర్గాల్లోని పలు మండలాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలకు మహిళలు పెద్దఎత్తున తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పలు ఆలయాల వద్ద హోమాలు చేపట్టారు.



ఆస్పరి: రామతీర్థంలో హోమం చేస్తున్న భక్తులు



ఆదోని ఎస్కేడీ కాలనీ: ఆదోని అంబాభవాని ఆలయంలో మహిషాసుర మర్దినిగా..




ఆదోని పాతపట్టణం: నెమలి ఈకల అలంకరణలో ఆదోని లక్ష్మమ్మవ్వ



దేవనకొండ: అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఆదోని మండలంలో...



పత్తికొండ గ్రామీణం: మహాలక్ష్మిగా కన్యకాపరమేశ్వరి

## వసతిగృహాలు మంజూరు చేయండి



ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గంలో వలసల నివారణకు ప్రభుత్వ విద్యార్థి వసతిగృహాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే పార్థసారథి శుక్రవారం రాష్ట్ర విద్య శాఖమంత్రి నారా లోకేశ్‌ను కోరారు. పశ్చిమ పల్లెల్లో పెద్దలతో పాటు పిల్లలు కూడా వలస వెళ్తున్నారు. దీంతో చదవలేకపోతున్నారన్నారు. వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, మాదాసి కురవలకు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు జారీ వంటి అంశాలను మంత్రికి వివరించారు. త్వరలో మంజూరు చేస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## పల్లె కబుర్లు

మార్లెల్ల(తుగ్గలి), న్యూస్‌టుడే: మార్లెల్ల గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న తితిదే ధార్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిసినట్లు ధార్మిక ఉపన్యాసకులు సురేశ్‌బాబు తెలిపారు. భారత, భాగవత, రామాయణ, మహాభారతాలు గురించి చివరి రోజు గోసేవ ప్రాముఖ్యతను వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ ప్రచార పరిషత్ కర్నూలు శాఖ కార్యనిర్వాహకులు వేంకటరెడ్డి, సభ్యులు కోదండా, అంజి తదితరులు పాల్గొన్నారు.

రాతన(తుగ్గలి), న్యూస్‌టుడే: తుగ్గలి, రాతన గ్రామాలలో నల్లరేగడి పొలాలు ఉన్న రైతన్నలకు రబీ కింద రాయితీ పప్పుశనగ విత్తనాలు శుక్రవారం పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి పవన్‌కుమార్ తెలిపారు. తుగ్గలి మండలానికి 650 క్వింటాల్ల పప్పుశనగ విత్తనాలు మంజూరయినట్లు ఏవో తెలిపారు. ఆయా గ్రామాలలో తెదేపా నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు, మనోహర్ చౌదరి, తిరుపాల్‌నాయుడు, గురుస్వామి, వెంకటపతి, ఈరమ్మ చేతుల మీదుగా రైతన్నలకు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదెమ్మ నేత్రాలు.. జీవన వెలుగులు



ఆదెమ్మ (పాత చిత్రం)

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని కౌడల్‌పేటకు చెందిన వృద్ధురాలు పాండ్రే ఆదెమ్మ అనారోగ్యంతో శుక్రవారం మృతిచెందారు. ఆమె నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులు ఆదోని పట్టణానికి చెందిన సాయిజ్యోతి నేత్రదాన ఐ ఫౌండేషన్ సంస్థ సభ్యులను సంప్రదించారు. వారు మృతురాలి నేత్రాలు సేకరించారు. కార్యక్రమంలో మృతురాలి కుటుంబ సభ్యులు చంద్రశేఖర్, గోరా, సరోజిని, సంస్థ నిర్వాహకులు కొల్లి శ్రీధర్, కాలేపల్లి విశ్వనాథ్, శంకర్, టెక్నీషియన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. సంస్థ ఆధ్వర్యంలో నేత్రాల సేకరణ వందకు చేరినట్లు నిర్వాహకులు తెలిపారు.



నేత్రాలు దానం చేస్తున్న కుటుంబ సభ్యులు

## సచివాలయ సిబ్బందికి సన్మానం

ఆదోని ఎస్కేడీ, న్యూస్‌టుడే: ఇస్వీ గ్రామానికి చెందిన ధనలక్ష్మి కర్నూలు నగరంలోని విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆమెకు ప్రభుత్వం అందించాల్సిన సామాజిక వితంతు పింఛను గ్రామానికి చెందిన సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు తిరుమలేశ్ కర్నూలు నగరంలోని ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న ధనలక్ష్మికి పింఛను పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టరు రంజిత్‌బాషా, డీఆర్‌డీఏ అధికారి సలీంబాషా సచివాలయ ఉద్యోగి తిరుమలేశ్‌ను సన్మానించి ప్రశంసా పత్రం అందించారు.



సచివాయల ఇంజినీరింగ్ సహాయకుడు తిరుమలేశ్‌ను సన్మానిస్తున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా

## లోకేశ్ దృష్టికి కార్యకర్తల సమస్యలు



ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే: ఆదోని నియోజకవర్గ పరిస్థితులు, తెదేపా కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న సమస్యలను నారా లోకేశ్‌కు వివరించినట్లు తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మీనాక్షినాయుడు తెలిపారు. ఉండవల్లిలో శుక్రవారం ఆదోని అభివృద్ధికి సహకరించాలని కోరామన్నారు. ఇందుకు సానుకూలంగా స్పందించారన్నారు. మీనాక్షినాయుడికి మూడు రోజుల కిందట ఇంట్లో డోర్ తగిలి చేయికి గాయమైంది. వైద్యులు చికిత్స అనంతరం కట్టుకట్టారు. అధిష్ఠానం నుంచి పిలుపురావడంతో అలాగే వెళ్లారు.

## ఆదోని మార్కెట్‌యార్డుకు సెలవు నేడు

ఆదోని మార్కెట్, న్యూస్‌టుడే: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు శనివారం సెలవు ప్రకటించినట్లు మార్కెట్ యార్డు కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి శుక్రవారం తెలిపారు. తుపాన్ నేపథ్యంలో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల విన్నపం మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. దీంతో పాటు శుక్రవారం అధికంగా పంట దిగుబడులు రావడంతో వర్షం కారణంగా తూకాలు ఆలస్యమయ్యాయి. దీంతో శనివారం యార్డులో పంట దిగుబడుల వ్యాపారాలకు విరామం ప్రకటించారు. 7వ తేదీ యార్డులో క్రయ విక్రయాలు ప్రారంభమవుతాయని, రైతులు గమనించి, సహకరించాలన్నారు.

## మండలాన్ని అభివృద్ధి వైపు నడిపించాలి

కృష్ణగిరి, న్యూస్‌టుడే: మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రాజకీయలకతీతంగా సమన్వయంతో పనిచేసి కృష్ణగిరి మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని ఎంపీపీ కంగాటి వెంకట్రామిరెడ్డి, జడ్పీటీసీ సభ్యురాలు కేఈ సుభాషిణి అన్నారు. కృష్ణగిరిలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అధికారులు సమయపాలన పాటించడం లేదని ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## దారి చెదిరి.. వాహనదారులు బెదిరి

హాలహర్వి మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారి దెబ్బతింది. అధికారులు వీటిని పట్టించుకోకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. హాలహర్వి మండల పరిధిలోని మేదేహాల్ వద్ద జాతీయ రహదారిపై వాగు ప్రవహించి కోతకు గురైంది. మరమ్మతులు చేపట్టకపోవడంతో తరుచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. మేదేహాల్, కామినహాల్ గ్రామాల ప్రజలకు ప్రయాణం సవాల్‌గా మారింది. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, హొళగుంద(హాలహర్వి)



## మహిళ అదృశ్యంపై కేసు నమోదు

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో నివాసముంటున్న ఆస్పరి అంజినమ్మ (45) గత శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు ఆమె కుమారుడు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు. కుమారుడితో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు తెలిపారు. ఆరు రోజులుగా ఆమె ఆచూకీ కోసం లభించకపోవడంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

ఆదోని గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదోని మండలం పెద్దతుంబళం ఎల్లెల్సీ కాల్వ సమీపంలో కర్ణాటక మద్యం తరలిస్తున్న కోసిగి గ్రామానికి చెందిన బోయ వీరేశ్‌ను అరెస్టు చేసినట్లు పెద్దతుంబళం ఎస్సై మహేశ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 10 బాక్సులు (960 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు) మద్యం, ద్విచక్ర వాహనాన్ని జప్తు చేసినట్లు వెల్లడించారు. నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు.

పత్తికొండ పట్టణం, న్యూస్‌టుడే: మండలంలోని బుగ్గ తండాకు చెందిన పాండునాయక్ ద్విచక్ర వాహనంపై నాటుసారా తరలిస్తుండగా శుక్రవారం సాయంత్రం పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. అతని వద్ద నుంచి 30 లీటర్ల నాటుసారా, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

## గాయపడిన యువకుడు మృతి

దేవనకొండ, న్యూస్‌టుడే : మండల పరిధిలోని కర్నూలు-బళ్లారి రహదారిలోని గద్దరాళ్ల స్టేజీ వద్ద గురువారం రాత్రి ఓ యువకుడి (28)ని గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టిన ఘటన విదితమే. ఘటనలో తీవ్రగాయాలైన యువకుడిని పోలీసులు కర్నూలు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుడి చేతులపై శిలువ, దుర్గమ్మ, జ్యోతి, 134 నంబరు పచ్చబొట్లు ఉన్నట్లు చెప్పారు. గురువారం పత్తికొండ నుంచి దేవనకొండకు ఆర్టీసీ బస్సులో టిక్కెట్ తీసుకున్నట్లు వివరించారు. మృతదేహాన్ని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంచినట్లు తెలిపారు.

ఎమ్మిగనూరు
• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

## అభివృద్ధి పనులకు భూమి పూజ


భూమి పూజలో సర్పంచి హైమావతి, మండల కన్వీనర్ నజీర్ సాహెబ్

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్లలో అభివృద్ధి పనులకు సర్పంచి హైమావతి, తెదేపా మండల కన్వీనర్ నజీర్ సాహెబ్ శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపడుతున్నట్లు వివరించారు. గోనెగండ్లలో రూ.47 లక్షలతో పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బేతాళ బడేసాబ్, తిరుపతయ్య, రామాంజనేయులు, శ్రీధర్, రంగముని, రఘ్యాతుల్లా, మిన్నల్ల, అక్బర్, షేక్షావలి పాల్గొన్నారు.

## పన్నులు చెల్లింపులో నిర్లక్ష్యం వద్దు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పురపాలక సంఘంలో గృహ, నీటి, ఇతర పన్నుల వసూలు విషయంలో నిర్లక్ష్యం వహించ వద్దని కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శుక్రవారం సచివాలయ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇంటి పన్ను బకాయిలు ఉన్నవారికి తాఖీదులు జారీ చేయాలన్నారు. ఎవరైనా నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు.

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
ఎమ్మిగనూరు (గ్రామీణం): 80085 73794
కోడుమూరు: 80085 73776

పెద్దకడబూరు: **సమస్య:** మండలంలోని జాలవాడి గ్రామంలో చాలా రోజుల నుంచి కాల్వలు శుభ్రం చేయడం లేదు. దుర్గంధంతోపాటు రాత్రిపూట దోమల బెడద ఎక్కువైంది. మురుగు కాల్వలు శుభ్రం చేయించగలరు. – గవిన్న, జాలవాడి

**సమాధానం:** పంచాయతీలో నిధులను అనుసరించి పారిశుద్ధ్య పనులు చేపడతాం. – జయరాముడు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

## ఉత్పాదకత పెంచేందుకు కృషి చేయాలి


మాట్లాడుతున్న ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు సలహాలు, సూచనలు అందజేసి మిరప, కంది, వరి పంటల్లో ఉత్పాదకతను పెంచేందుకు కృషి చేయాలని ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుజాతమ్మ, ఏడీఏ ఎస్.మహమ్మద్ ఖాద్రీ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఉప విభాగంలోని నాలుగు మండలాలకు చెందిన రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రబీలో సాగుకు అనువైన రకాలు, విత్తనశుద్ధి వంటి విషయాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ గిరీష్ పాల్గొన్నారు.

## 7న గోనెగండ్లలో ప్రజా వేదిక

గోనెగండ్ల, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ప్రజా వేదిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెదేపా మండల కన్వీనర్ నజీర్ సాహెబ్ అన్నారు. శుక్రవారం తెదేపా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 7వ తేదీన గోనెగండ్లలోని బాషా ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజా వేదిక కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు తిరుపతయ్య, రామాంజనేయులు, బేతాళబడేసాబ్, శ్రీధర్, రమేశ్‌నాయుడు, చంద్రశేఖర్, వెంకటేశ్, పక్కీర్, బాబులునాయుడు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ 6 పథకాలను అమలు చేయాలని అఖిల భారత రైతు సంఘం నాయకుడు ఏసేబు డిమాండు చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి మాట్లాడారు. పంట నష్టపోయిన బాధిత రైతులకు పరిహారం ఇవ్వాలన్నారు. సాగునీటి వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్న ప్రసాద్, రవి, విజయ్, సిద్ధూ పాల్గొన్నారు.

# కాగితాల్లోనే నిషేధం.. కవర్లపై కట్టడి శూన్యం

### గూడూరు పట్టణంలో విచ్చలవిడిగా వినియోగం

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ పర్యావరణాన్ని కలుషితం చేస్తోంది. విచ్చలవిడిగా వినియోగిస్తుండటంతో జీవాలు మూగజీవాలు సైతం మృత్యువాత పడుతున్నాయి. గూడూరు నగర పంచాయతీలో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమైంది. ఫలితంగా క్రయ, విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అధికారులు క్షేత్ర స్థాయిలో తనిఖీలు చేయకపోవడం, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వ్యాపారులకు అడ్డూ అదుపు లేకుండా పోయింది.

| | |
|---|---|
| నగర పంచాయతీ జనాభా: | 26 వేలు |
| వార్డులు: | 20 |
| కంపోస్టు యార్డు: | 1 |
| రోజూ వెలువడే వర్థాలు: | 8 టన్నులు |
| ప్లాస్టిక్ వ్యర్థాలు: | 2 టన్నులు |


డంప్ యార్డులో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

నగర పంచాయతీలో రోజుకు 8 టన్నుల వ్యర్థాలు వెలువడుతుండగా, ఇందులో అధికంగా ప్లాస్టిక్ కవర్లే ఉండటం గమనార్హం. వాణిజ్య దుకాణాల వద్ద కుప్పలు కుప్పలుగా పోగవుతుండగా, కాలనీల్లో ప్రజలు వాడిన కవర్లు కాలువల్లో పడి మురుగు ముందుకు కదలనివ్వడం లేదు. దీంతో మురుగంతా రహదారిపై చేరుతోంది. వారం కిందట నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ నాగరాజు ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలకు ఉపక్రమించారు. వాణిజ్య దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించారు. మొదటిసారి చర్యలు తీసుకోవడం లేదని, ఇక మీదట తనిఖీలో కనిపిస్తే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. నగర పంచాయతీలో సుమారు 700 దుకాణాలు ఉండగా, 100 వరకు ప్లాస్టిక్ విక్రయించే దుకాణాలున్నాయి. ఎక్కువగా రాజవీధి, తెలుగు గేరి, కమేలా వీధి, ముల్లావీధి, పైరెలేటర్‌తోపాటు మద్యం దుకాణాల సమీపంలో ప్లాస్టిక్ గ్లాసులు, కవర్లు గుట్టలుగా పేరుకుపోయాయి.

### తీరు మారకుంటే చర్యలు తప్పవు

–నాగరాజు, కమిషనర్

ప్లాస్టిక్ కవర్ల వినియోగంపై వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించి చైతన్యపరుస్తున్నాం. తీరు మారకుంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. భావితరాల భవిష్యత్తును దృష్టికి ఉంచుకుని పర్యావరణానికి ముప్పు వాటిల్లే ప్లాస్టిక్‌ను అందరి సహకారంతో పకడ్బందీగా నిషేధిస్తాం.

## నేడు పురపాలక కమిషనర్‌తో ఫోన్‌ఇన్

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు ప్రజలు గుంతలమయమైన రహదారులు, తాగునీటి సరఫరాలో అంతరాయం, శివారు ప్రాంతాల్లో వెలగని దీపాలు, కుక్కల బెడద తదితర సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారా..? మీ సమస్యను ఎవరికి చెప్పాలో తెలియడం లేదా..! అయితే ఈనాడు మీ సమస్యలను పురపాలక కమిషనర్ గంగిరెడ్డి, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తుంది. శనివారం దిగువ ఇచ్చిన ఈ కింది చరవాణి నంబర్లకు ఫోన్ చేసి మీ సమస్యలు నేరుగా వివరించి పరిష్కారం పొందగలరు.

ఫోన్ చేయాల్సిన నంబర్లు:
80085 73824, 94405 93490
సమయం: ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

## సుంకేసులకు తగ్గిన ఇన్‌ఫ్లో

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గిందని జలాశయ ఇంజినీర్ రాజు తెలిపారు. శుక్రవారం నాటికి జలాశయంలో 1.235 టీఎంసీలు నిల్వ ఉందని కేసీ కాల్వకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## చిన్నశేష వాహనంపై స్వామి ఊరేగింపు

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని కందనాతిలో చెన్నకేశవస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి ఉత్సవమూర్తిని ఆలయం నుంచి గ్రామం పుర వీధుల గుండా చిన్నశేష వాహనంపై ఊరేగించారు. ఆలయంలో పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని పట్టు వస్త్రాలు, ఆభరణాలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## అక్రమ కట్టడాల తొలగింపు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని నెహ్రూనగర్‌లో అక్రమ కట్టడాలతో కాల్వ పూడ్చివేయడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో వాటిని తొలగించినట్లు పురపాలక కమిషనర్ గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం కాలనీలో పర్యటించి మురుగు నీటికుంట ఇతర సమస్యలను పరిశీలించారు. పూడికతో నిండిన కాల్వను శుభ్రం చేసి మురుగు పారేలా చేశామన్నారు. ఆయన వెంట డీఈ నీరజా ఉన్నారు

## నేడు ఉచిత వైద్య శిబిరం

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో శనివారం మంత్రాలయం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సర్పంచి రామాంజనేయులు శుక్రవారం తెలిపారు. ఆదోని మధు ఆసుపత్రి వైద్య బృందంతో రక్తపోటు, మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## సాంకేతిక సమస్య పరిష్కరించాలని వినతి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: కస్తూర్బాగాంధీ గురుకుల బాలిక పాఠశాలల్లో విడుదల చేసిన ఉద్యోగ నియామకాల్లో పీజీటీ విశ్వవిద్యాలయం ఆన్‌లైన్‌లో సాంకేతిక సమస్యతో చూపడం లేదని, సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ (సమగ్ర శిక్ష అభియాన్) శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించినట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య మాదిగా తెలిపారు. శుక్రవారం ఆయన్ని విజయవాడలో కలిసి ఈమేరకు సమస్య విన్నవించామన్నారు. ఆయన వెంట నాయకులు ప్రతాప్, గిడ్డయ్య ఉన్నారు.

## ఇసుకంతైనా ఆగని అక్రమ రవాణా



రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని ప్రవేశపెట్టినా కొందరు నాయకులు మాత్రం ఇంకా ఇసుకను అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు కొందరు ఈ దందాకు పాల్పడుతున్నారు. శుక్రవారం మండలంలోని నాగలదిన్నె నదీతీరంలో ట్రాక్టర్ల ద్వారా ఇసుక మళ్లిస్తున్నారు. నందవరం పోలీస్‌స్టేషన్ ఎదురుగానే ఇసుక ట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

## డ్రమ్ము పెట్టారు.. చేతులు దులుపుకొన్నారు



ఇటీవల కురిసిన వర్షాలకు కోడుమూరులోని వై.కూడలి దగ్గర ప్రధాన రహదారిపై గుంతలు పడి ప్రమాదకరంగా మారాయి. కర్నూలు-బళ్లారి ప్రధాన రహదారిపై కొన్ని రోజులుగా గుంతలు పడ్డా పట్టించుకునేవారు కరవయ్యారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్నారు. దాంతో స్థానికులు కొన్ని రోజులు రాళ్లు అడ్డంగా పెట్టారు, తర్వాత వాటిని తొలగించి డ్రమ్మునే ఏర్పాటు చేశారు. అధికారులు ఇప్పటికైనా గుంతలు పూడ్చాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

## ట్యాంకు వృథా.. తాగునీటికి వృథా



నగర పంచాయతీలోని తెలుగు గేరిలో మినీ ట్యాంకు నిరుపయోగంగా ఉంది. దీనికి నీటి సరఫరా చేసే బోరుమోటారు చెడిపోవడంతో నీళ్లు లేక వృథాగా మారింది. ఈ ట్యాంకుపై 20 కుటుంబాలు ఆధారపడ్డాయి. రెండు నెలల నుంచి నీటి సరఫరా నిలిచిపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోరుమోటారుకు మరమ్మతులు చేయించి నీటిని సరఫరా చేయాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, గూడూరు గ్రామీణం

## బంగారం దొంగల అరెస్టు

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్, గూడూరు, కోడుమూరు మండలాల్లో మూడు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై తిమ్మారెడ్డి

నెలల నుంచి పగలు, రాత్రివేళల్లో ఇళ్లలో బంగారం దొంగతనం చేసిన ముగ్గురిని శుక్రవారం పోలీసులు సి.బెళగల్‌లో కొట్టారుమిట్ట ప్రాంతంలో అరెస్టు చేశారు. గూడూరు పడమర బీసీ కాలనీకి చెందిన కుక్కల రామాంజనేయులు (35), మారందొడ్డి గ్రామానికి చెందిన బి.శ్రీనివాసులు (46), కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన వేణుగోపాల్ (19)ను ఎస్సై తిమ్మారెడ్డి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రెండు ద్విచక్ర వాహనాలు, చరవాణులు, 24 గ్రాముల బంగారం, 270 గ్రాముల వెండి, రూ.5.95 లక్షలు స్వాధీనం చేసుకుని రిమాండుకు పంపినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## కర్ణాటక మద్యం పట్టివేత

నందవరం, న్యూస్‌టుడే: మండలంలోని ధర్మపురం టోల్‌ప్లాజా సమీపంలో ఓ కారులో కర్ణాటక మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన నందవరం పోలీస్‌స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ఈడిగ వెంకటేశ్ డోన్ మండలంలోని ఎర్రగుడి గ్రామానికి తరలిస్తుండగా తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనితోపాటు ఉన్న బాలు అనే వ్యక్తి పరారైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసులు మల్లికార్జున, మల్లేశ్, వీరేశ్ పాల్గొన్నారు.


గూడూరు గ్రామీణం: రాజావీధిలోని పాత అంబాభవాని ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న మహిళలు


గూడూరు గ్రామీణం: గూడూరులో గాయత్రీదేవిగా అమ్మవారు


కోడుమూరు గ్రామీణం: గోరంట్లలో ధాన్యలక్ష్మి అలంకరణలో అమ్మవారు


మంత్రాలయం: ధనలక్ష్మి రూపంలో గ్రామదేవత మంచాలమ్మ


మంత్రాలయం: గాయత్రీదేవి అవతారంలో ఆర్య వైశ్య సంఘంవారు ఏర్పాటు చేసిన అమ్మవారు

# జయము.. జయము.. జగన్మాత

ఎమ్మిగనూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో శుక్రవారం దుర్గాదేవి వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమార్చనలు చేశారు. కొన్ని ఆలయాల్లో అమ్మవారిని కరెన్సీ నోట్లతో అందంగా అలంకరించారు. – న్యూస్‌టుడే బృందం

కౌతాళం: ఉప్పరహాల్‌లో గాయత్రీదేవి అలంకరణ



ఎమ్మిగనూరు: పట్టణంలోని సోగనూరు మార్గంలో రూ.11.50 లక్షల కరెన్సీ నోట్లతో అలంకరించిన జమ్ములమ్మదేవి

## ఎంపీడీవోగా శోభారాణి బాధ్యతల స్వీకరణ

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం నూతన ఎంపీడీవోగా శోభారాణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె నందికొట్కూరు నుంచి బదిలీపై రాగా, ఇక్కడ పని చేస్తున్న మణిమంజరి గోనెగండ్లకు వెళ్లారు. ఏవో అమరేంద్ర, కార్యాలయ సిబ్బంది వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

### గోనెగండ్లకు మణిమంజరి..

గోనెగండ్ల, న్యూస్‌టుడే: గోనెగండ్ల ఎంపీడీవోగా మణిమంజరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె మంత్రాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేసిన ఎంపీడీవో పాణ్యంకు వెళ్లారు. ఈవోఆర్డీగా అనంతశయనతో పాటు పంచాయతీ కార్యదర్శులు బాధ్యతలు స్వీకరించారు. అనంతరం వారిని ఏవో బాబుభాస్కర్, సిబ్బంది రహిమాన్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేష్, సతీష్, వెంకటేశ్వర్లు సన్మానించారు.

### మండల సర్వేయర్...

మంత్రాలయం, న్యూస్‌టుడే: మంత్రాలయం సర్వేయర్‌గా కొత్తగా అశోక్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు సచివాలయ సర్వేయర్లు రాఘవేంద్రస్వామి చిత్రపటాన్ని ఇచ్చి సత్కరించారు.

### గూడూరు ఏపీఎంగా అయ్యమ్మ...

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: గూడూరు మండల ఏపీఎంగా అయ్యమ్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలులోని డీఆర్డీఏ కార్యాలయం నుంచి ఆమె బదిలీపై రాగా, ఇక్కడున్న ఏపీఎం సుధాకర్ జిల్లా కేంద్రంలోని ప్రధాన కార్యాలయంలోని బీమా విభాగానికి బదిలీ అయ్యారు. ఎంపీడీవో, తహసీల్దార్, ఎంఈవో, హౌసింగ్ ఏఈ పాల్గొన్నారు.

### సి.బెళగల్‌లో...

సి.బెళగల్, న్యూస్‌టుడే: సి.బెళగల్‌లో శుక్రవారం ఎంపీడీవో రాణెమ్మ, ఈవోఆర్డీ ఈశ్వరయ్యస్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలకల్ గ్రామానికి చెందిన తెదేపా నాయకులు అమర్, సోమన్న, అంజి శుభాకాంక్షలు తెలిపారు.

### ఈవోఆర్డీ జయరాముడుకు..

పెద్దకడబూరు, న్యూస్‌టుడే: ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా ఈవోఆర్డీ జయరాముడు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన డోన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. త్వరలో రెగ్యులర్ ఎంపీడీవో రానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

### నందవరం ఎంపీడీవోగా..

నందవరం, న్యూస్‌టుడే: నందవరం ఎంపీడీవోగా పుల్లయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అనంతపురం గ్రామీణ మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఎంపీడీవో దశరథరామయ్య నంద్యాల జిల్లా మిడుతూరుకు బదిలీ అయ్యారు.

## నైపుణ్యంతోనే ఉద్యోగాలు సాధ్యం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థులు సాఫ్ట్‌వేర్ రంగంలో నైపుణ్యం సాధిస్తే ఉద్యోగాలు సాధించవచ్చని ఎర్రకోట సెయింట్‌జాన్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీరన్న అన్నారు. శుక్రవారం కళాశాలలో బీటెక్ విద్యార్థులకు వివిధ కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించాయి. ప్రపంచంలో సాఫ్ట్‌వేర్ రంగానికి మంచి గుర్తింపు ఉందన్నారు. యువతరం సాంకేతిక రంగం వైపు పయనించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.


ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ వీరన్న


## ప్రతిభతో ఉజ్వల భవిష్యత్తు


ముఖాముఖి నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో ప్రతిభ ఉంటే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని నిరూపించారని తెదేపా నాయకుడు ఉరుకుందయ్యశెట్టి అన్నారు. శుక్రవారం ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉద్యోగమేళా నిర్వహించారు. ఐదేళ్ల వైకాపా పాలనలో నిరుద్యోగులకు ఎలాంటి ఉద్యోగావకాశాలు కల్పించలేదన్నారు. అధికారంలో వచ్చిన నాలుగు నెలల్లోనే ఎమ్మిగనూరు ప్రాంతంలో 204 మందికి ఉద్యోగావకాశం కల్పించినట్లు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల నుంచి 400 మంది యువతీ, యువకులు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు రంగస్వామిగౌడ్, ముల్లా కల్లీముల్లా, చేనేత మల్లికార్జున, మిన్నప్ప, నరసింహులు, రాజు, రంగన్న సుధాకర్ పాల్గొన్నారు.

## సంపద సృష్టించని కేంద్రం

మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన చెత్త సంపద కేంద్రం వృథాగా మారింది. గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడి చెత్తగా వేర్వేరు చేసి ఎరువుగా తయారు చేయాలి. కానీ పంచాయతీ అధికారుల నిర్లక్ష్యంతో కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడ పేరుకుపోతూ అపరిశుభ్రత నెలకొంటోంది. ఇప్పటికైనా అధికారులు కేంద్రాన్ని వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పెద్దకడబూరు



## మోటార్లకు మీటర్లు రద్దు చేయాలి

ఎమ్మిగనూరు గ్రామీణం, న్యూస్‌టుడే: వ్యవసాయ విద్యుత్తు మోటార్లకు మీటర్ల బిగింపు పథకాన్ని రద్దు చేయాలని రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఏసేపు డిమాండు చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం, చిన్నసన్నకారు రైతులకు పింఛన్ అందజేయాలన్నారు. ధర్నాలో నాయకులు ఉరుకుంద, షద్రక్, జయన్న, అనీఫ్ పాల్గొన్నారు.

## వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,080

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం వేరుశనగ క్వింటా గరిష్ఠ ధర రూ.7,080, మధ్యస్థం రూ.6,009, కనిష్ఠం రూ.2,920కు వ్యాపారులు కొన్నారు. మార్కెట్‌కు రైతులు 9,614 వేరుశనగ బస్తాలను అమ్మకానికి తెచ్చారు. ఆముదాలు క్వింటా గరిష్ఠ ధర రూ.5,911, మధ్యస్థం రూ.5,839, కనిష్ఠం రూ.4,769 పలికింది.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు


హాల్వి గ్రామస్థులతో మాట్లాడుతున్న సీఐ అశోక్‌కుమార్

మంత్రాలయం గ్రామీణం (కౌతాళం), న్యూస్‌టుడే: గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని కౌతాళం సీఐ అశోక్‌కుమార్ అన్నారు. మండలంలోని హాల్వి గ్రామాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. గ్రామంలో కొంత మంది నివాస గృహాల మధ్య మద్యం తాగిన సీసాలు పగులగొడుతున్నారని, వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామంలో అల్లర్లకు పాల్పడినా, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించినా జీవితాలు నాశనమవుతాయన్నారు.

## ఉచిత ఇసుక తక్షణమే అమలు చేయాలి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక విధానాన్ని తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ డివిజన్ నాయకులు రాముడు డిమాండు చేశారు. శుక్రవారం తహసీల్దార్ శేషఫణికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఎమ్మిగనూరు పరిసర ప్రాంతాల్లో ఇసుక లేక సుమారు 30 వేల మంది కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. పేరుకే ఉచితం తప్ప, ఒక్క టిప్పర్‌కు సుమారు రూ.20 వేలకుపైగా అక్రమంగా వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజు, రాఘవేంద్ర, లాల్‌సాబ్, రమేశ్ పాల్గొన్నారు.

## విద్యుత్తు ఈఈకి సన్మానం

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ఎమ్మిగనూరు సబ్ డివిజన్ నూతన ఈఈగా బాధ్యతలు చేపట్టిన విజయరాజును శుక్రవారం ఉద్యోగులు సన్మానించారు. కార్యాలయంలో కలిసి తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ శాంతిస్వరూప్, సిబ్బంది సురేష్‌కుమార్, తిమ్మప్ప, వీర్రరాజు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తున్నాం

### 'న్యూస్‌టుడే'తో విద్యుత్తు శాఖ ఈఈ విజయరాజు



ముఖాముఖి

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: డివిజన్ పరిధిలో విద్యుత్తు లోవోల్టేజీ సమస్య, వాలిన విద్యుత్తు తీగలు, రైతుల దరిచేరని కనెక్షన్లు తదితర సమస్యలు నెలకొన్నాయి. ఎమ్మిగనూరు సబ్ డివిజన్ పరిధిలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో విద్యుత్తు సమస్యలు, వినియోగదారులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆ శాఖ ఈఈ విజయరాజు దృష్టికి తీసుకెళ్లగా వాటి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

★ ఉప విభాగంలో 63 వేల విద్యుత్తు కనెక్షన్ల కింద సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వ్యవసాయానికి ప్రభుత్వం 9 గంటల విద్యుత్తు సరఫరా చేస్తోంది. పగలు ఏడు, రాత్రి రెండు గంటల చొప్పున ఇస్తున్నాం. మధ్యలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడినా రైతులకు మళ్లీ ఆ సమయాన్ని కేటాయించి ఇస్తున్నాం. లోవోల్టేజీ ప్రాంతాల్లో కొత్త విద్యుత్తు నియంత్రికలు ఏర్పాటు చేస్తున్నాం. ఇప్పటికే ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, కోసిగి ప్రాంతాల్లో గుర్తించాం. ఇటీవల ఉరుములు, మెరుపులతో 22 విద్యుత్తు నియంత్రికలు కాలిపోయాయి. వాటి స్థానంలో కొత్త వాటిని వెంటనే ఏర్పాటు చేశాం. విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా లైన్‌మెన్ల ద్వారా ఎప్పటికప్పుడు వివరాలు తెలుసుకుంటూ తక్షణమే మరమ్మతులు చేపడుతున్నాం.

★ సబ్ డివిజన్ పరిధిలోని పది మండలాలు, ఎమ్మిగనూరు పట్టణంలో 42 విద్యుత్తు ఉప కేంద్రాలున్నాయి. గృహ వినియోగదారులు 1.90 లక్షలు, వ్యవసాయ కనెక్షన్లు 63 వేలు ఉన్నాయి. ప్రతి నెలా రూ.11 కోట్ల మేర డిమాండు ఉంది. ప్రస్తుతం మూడు కేటగిరీల్లో వంద శాతం వసూలవుతోంది. ఎస్సీ, ఎస్టీలు 200 యూనిట్ల కింద 31,350 మంది లబ్ధి పొందుతున్నారు.

★ ఎమ్మిగనూరు పట్టణం, నందవరం, గోనెగండ్ల, పెద్దకడబూరు, కోసిగి, మంత్రాలయం, సి.బెళగల్ పరిధిలో లోవోల్టేజీ సమస్య నెలకొంది. ఆయా గ్రామాల్లో అదనంగా విద్యుత్తు నియంత్రికలు అమర్చేందుకు సామగ్రి సిద్ధంగా ఉంది. అత్యవసరం కింద నియంత్రికలు, తీగలు, మరమ్మతులు చేయిస్తాం. మా వాహనంలోనే సామగ్రి అంతా తీసుకువచ్చి అమర్చుతాం. రైతులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూస్తాం.

★ సబ్ డివిజన్ పరిధిలో మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు ప్రాంతాల్లో 2,685 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. గతేడాది అక్టోబరు నుంచి దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో సరిగాలేని 547 తొలగించాం, ఇంకా 2,138 మందికి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. వీటికి ప్రతిపాదనలు తయారు చేసి పంపించాం. మెటీరియల్ వచ్చిన ప్రకారం రైతులకు సీనియార్టీ ప్రకారం కనెక్షన్లు ఇచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం. రైతులు, ప్రజలు ఏవైనా సమస్యలున్నా తక్షణమే ఆయా ఉపకేంద్రాల పరిధిలోని అధికారులకు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయండి, విద్యుత్తు కనెక్షన్లు, ఇతర సమస్యలపై తాము నిరంతరం గ్రామాల్లో పర్యటించి పరిష్కరిస్తున్నాం.

## ఇంజిన్ ఇచ్చారు.. ట్రాలీ మరిచారు


మండలంలోని కంబదహాల్ గ్రామంలో చెత్త, చెదారాన్ని తరలించేందుకు 8 నెలల కిందట రూ.6 లక్షలతో ట్రాక్టర్ ఇంజిన్‌ను కొనుగోలు చేసి సర్పంచి చిన్న ఈరమ్మకు అందించారు. దీనికి ట్రాలీని ఇంత వరకు ఇవ్వకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఇక్కడ హరితరాయబారులు ఇద్దరే ఉన్నారు. కాలువల్లో తొలగించిన వ్యర్థాలను తరలించేందుకు ఇబ్బందిగా ఉందని, ఇప్పటికైనా ట్రాలీని మంజూరు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, సి.బెళగల్



# కర్నూలు

•కర్నూలు •పాణ్యం

## జిల్లా పోలీసులకు డీజీపీ అభినందన



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీజీపీ ద్వారకా తిరుమలరావు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పోలీసు శాఖ గత నెల 14వ తేదీన జరిగిన జాతీయ లోక్‌అదాలత్‌లో అత్యధికంగా 816 కేసులు పరిష్కరించి రాష్ట్రస్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. కర్నూలు రెండో పట్టణ సీఐ నాగరాజరావు అధికంగా 50 కేసులు పరిష్కరించి ప్రథమ స్థానం, నాలుగో పట్టణ సీఐ మధుసూదన్‌గౌడ్ 42 కేసులు పరిష్కరించి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా విజయవాడలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ జి.బిందుమాధవ్, సీఐలను డీజీపీ ద్వారకా తిరుమలరావు అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

## ఇన్‌ఛార్జి పీడీగా నాగశివలీల

ఈనాడు, కర్నూలు: డీఆర్‌డీఏ పీడీ సలీం బాషా శుక్రవారం రిలీవ్ కావడంతో ఆయన స్థానంలో మెప్మా పీడీ నాగశివలీల ఇన్‌ఛార్జి పీడీగా బాధ్యతలు స్వీకరించారు. ప్రతాప్‌రెడ్డిని నియమించినప్పటికీ వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి బుగ్గనకు వ్యక్తిగత సహాయ కార్యదర్శిగా విధులు నిర్వర్తించడంతో ఆయన నియామకాన్ని తాత్కాలికంగా ఆపేశారు.

**మేమున్నాం.. మీకు తోడుగా..**

(10 AM TO 1 PM)
కర్నూలు : 80085 52632
కర్నూలు గ్రామీణం : 85010 05408
ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ, సమస్య: ఆదిత్యనగర్, దేవనగర్‌లోని వీధుల్లో కాలువలు శుభ్రం చేయకపోవడంతో వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. **- స్థానికులు**

సమస్య: కృష్ణానగర్‌లో రహదారి గుంతలమయంగా మారింది. అవస్థలు తప్పడం లేదు. **- ప్రశాంత్**

సమాధానం: పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపడతాం. **- నగరపాలక సంస్థ అధికారులు**

## బోధనేతర సిబ్బంది ఆందోళన

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వర్తిస్తున్న బోధనేతర సిబ్బంది ఇన్‌ఛార్జి వీసీ ఛాంబర్ ఎదుట శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. వేతనాల విషయంలో అన్యాయం జరుగుతోందని సిబ్బంది కృష్ణవేణి, కిరణ్మయి, రాణి, బాబు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. తమతోపాటు ఉద్యోగంలో చేరినవారికి ఎంటీఎస్ అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ విషయమై ఇన్‌ఛార్జి వీసీ ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ బోధనేతర సిబ్బంది సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



నిరసన తెలుపుతున్న బోధనేతర సిబ్బంది

## బాధ్యతల స్వీకరణ

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లా పౌరసరఫరాల అధికారిగా రాజా రఘువీర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా ఆయన కలెక్టర్ పి.రంజిత్ బాషా, జేసీ డా.బి.నవ్యను కలిశారు. అనంతరం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

## బకాయిల కొండ..

◆ ట్రేడ్ లైసెన్సు రుసుము వసూళ్లలో నిర్లక్ష్యం
◆ జమ చేయకుండా పలువురి చేతివాటం

# అక్రమాలకు అండ

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్సు బకాయిలు పెద్దఎత్తున పేరుకుపోతున్నాయి. లైసెన్సు ఉన్న దుకాణాల నుంచి వసూలు చేయడం లేదు. కొత్తగా ఏర్పాటు చేసుకుంటున్న దుకాణాలకు లైసెన్సులు ఇవ్వకుండానే డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి నగరంలో వేల సంఖ్యలో దుకాణాలున్నా లైసెన్సులు తీసుకున్న సంఖ్య తక్కువగానే ఉంది. నగరంలో చాలా దుకాణాలు ట్రేడ్ లైసెన్సులు లేకుండానే నడుస్తున్నాయి. గతంలో అనుమతి పొందినవారు సైతం వాటిని రెన్యువల్ చేసుకోవడం లేదు. ఫలితంగా నగరపాలక సంస్థ ఆదాయానికి గండి పడుతోంది.



### రూ.లక్షలు పక్కదారి

నగరపాలక పరిధిలో ట్రేడ్ లైసెన్సు బకాయిలు భారీగా పేరుకుపోయాయి. గత కొన్నేళ్లుగా దాదాపు రూ.32,81,0951 వరకు బకాయిలు పేరుకుపోయినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనిని వసూలు చేయడంలో నగరపాలక ప్రజారోగ్య విభాగం అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఫలితంగా నగరపాలక ఆదాయానికి గండి పడుతోంది.

☛ నగర పరిధిలో 30 వేలకుపైగా దుకాణాలు ఉండగా.. అధికారుల లెక్కల్లో మాత్రం కేవలం 10,749 దుకాణాలకు లైసెన్సులు ఉన్నట్లు చూపుతున్నారు. లైసెన్సు గడువు ముగిసిన దుకాణాలు సుమారు 20 వేల వరకు ఉంటాయి. వీటిలో సిబ్బంది లైసెన్సు పేరుతో వసూలు చేస్తున్నా నగరపాలక ఖజానాలో జమచేయకుండా జేబులో వేసుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలా ఏటా రూ.లక్షలు పక్కదారి పడుతోంది. బకాయిలు చూపిస్తున్న మొత్తంలోనూ చాలావరకు వసూలు చేసి లెక్కల్లో చూపడం లేదన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో నగరపాలక ఉన్నతాధికారి దీనిపై దృష్టి సారిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది.

### అందినకాడికి దోచుకున్నారు..

కర్నూలు నగరంలో సుమారు 6.5 లక్షల జనాభా ఉంది. చిన్న, పెద్ద దుకాణాలు కలిపి 30 వేలకుపైగా ఉన్నట్లు అంచనా. నగరపాలక పరిధిలో 10,749 దుకాణాలకు మాత్రమే లైసెన్సు ఉన్నాయి. నగరపాలక ప్రజారోగ్య విభాగం ప్రతి దుకాణం నుంచి లైసెన్సు, రెన్యువల్ రుసుములు వసూలు చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఏటా ఏప్రిల్ 1వ తేదీలోగా పూర్తి చేయాలి. అప్పటిలోగా చెల్లించనివారు.. ఏప్రిల్ నెలాఖరు నాటికి 25 శాతం అపరాధ రుసుముతో కలిపి చెల్లించాలి. మే 1వ తేదీ నాటికి అన్ని దుకాణాల నుంచి పూర్తిస్థాయిలో వసూలు చేయాలి. లేకుంటే సంబంధిత అధికారి సొంత సొమ్ము జమచేయాలి. రుసుము చెల్లించిన ప్రతి దుకాణంలోనూ లైసెన్సు ప్రదర్శనం ప్రదర్శించాలి. కానీ నగరంలోని పలు కాలనీల్లో పలువురు దుకాణదారులు ట్రేడ్ లైసెన్సు తీసుకోకుండానే వ్యాపారాలు సాగిస్తున్నారు. దీనికి నగరపాలక అధికారుల పూర్తి సహకారం ఉందన్న ఆరోపణలున్నాయి.

## క్రీడలతోనే గుర్తింపు సాధ్యం

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: క్రీడల ద్వారా విద్యార్థినులకు మనోధైర్యం వస్తుందని ఆర్‌యూ ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్ పేర్కొన్నారు. నగరంలోని శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాలలో ఆర్‌యూ అనుబంధ కళాశాలల కబడ్డీ పోటీలను రిజిస్ట్రార్ డా.ఎన్.వెంకటేశ్వర్లు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్ఎండీ.బాషా, కాంపిటీటివ్ ప్రిన్సిపల్ సుందర్‌రాజు, ఆర్‌యూ క్రీడల సమన్వయకర్త శివకిషోర్‌లతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ ఎస్ఎండీ బాషా మాట్లాడుతూ.. వివిధ కళాశాలల నుంచి 15 జట్లు కబడ్డీ పోటీల్లో పాల్గొంటున్నట్లు వెల్లడించారు. పోటీల్లో కర్నూలులోని శంకరాస్ డిగ్రీ కళాశాల, శ్రీసాయి కృష్ణ డిగ్రీ కళాశాల, శ్రీలక్ష్మి బీపీడీ కళాశాల, సెయింట్ జోసఫ్ మహిళా డిగ్రీ కళాశాలల జట్లు గెలుపొందాయి.



క్రీడాకారిణులను పరిచయం చేసుకుంటున్న ఉపకులపతి ఆచార్య ఎన్‌టీకే నాయక్

## నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: నగరంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు డీ2 సెక్షన్ పరిధిలోని పలు కాలనీల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని కర్నూలు డివిజన్ ఈఈ శేషాద్రి, డీ2 ఏడీఈ రాజేంద్రబాబులు శుక్రవారం తెలిపారు. ప్రజలు గమనించాలని కోరారు.

## కాలువలపై ఆక్రమణలు తొలగించాలి

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని కాలువలపై ఆక్రమణలు తొలగించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక ఆనంద్ థియేటర్ సమీపంలో హంద్రీ నది, మద్దూర్‌నగర్, గౌసియా కాంప్లెక్స్, లక్ష్మీనగర్ తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ హంద్రీనదిలో మట్టి, వ్యర్థాలను తొలగించడంతోపాటు రహదారులపై నీటి నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



నదిలో వ్యర్థాల తొలగింపును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు



సి.క్యాంపు సెంటరులోని విజయ గణపతి ఆలయంలో గాయత్రీగా..



శంకర మందిరంలో హోమంలో పాల్గొన్న భక్తులు



లలితాపీఠం వద్ద అమ్మవారికి పల్లకిసేవ

# కల్పవల్లి.. కరుణించు తల్లి

నగర పరిధిలోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి శుక్రవారం వివిధ అలంకరణలు చేశారు. భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ఆలయాలను విద్యుత్తు దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. బిర్లాగేట్ శంకర్ మందిరం సమీపంలోని దుర్గా మండపాల వద్ద లక్ష్మి గణపతి హోమం నిర్వహించారు. బి.క్యాంపులోని విజ్ఞాన మందిరంలో లక్ష్మిపూజ, కుంకుమార్చనలు జరిపారు. పాతబస్తీలోని లలితాపీఠం, కాళికాంబ ఆలయం, గీతామందిరం తదితర ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు.
–న్యూస్‌టుడే, కర్నూలు ఆధ్యాత్మికం, బీక్యాంపు, కల్లూరు గ్రామీణ



కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో గాయత్రీదేవి అలంకరణ



అయ్యప్పస్వామి ఆలయంలో..



కుంకుమార్చనలో మహిళలు



సూర్యనారాయణస్వామి ఆలయంలో విశేష అలంకరణ

# సేవలు దూరాభారమే

● అందుబాటులో లేని తాలూకా స్టేషన్

కర్నూలు గ్రామీణ, న్యూస్‌టుడే : కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్ అందుబాటులో లేకపోవడంతో గ్రామీణ ప్రాంత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కర్నూలు గ్రామీణ మండల పరిధిలో 24 పంచాయతీలు ఉన్నాయి. వీటిల్లో కొన్ని అతి సున్నిత ప్రాంతాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడేం జరుగుతుందో తెలియని పరిస్థితి. ఏదైనా సమస్య వచ్చినప్పుడు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. పలు గ్రామాల ప్రజలు స్టేషనుకు చేరుకోవాలంటే రెండు బస్సులు ఎక్కి సుమారు 2 గంటలపాటు ప్రయాణించాల్సిన పరిస్థితి. అష్టకష్టాలు పడి చేరుకున్నా స్టేషన్‌లో అధికారులు అందుబాటులో లేకుంటే ఆరోజంతా వృథానే.



బి.తాండ్రపాడులోని కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్

### అక్రమార్కులు తప్పించుకుంటూ..

కర్నూలు మండల పరిధిలోని ఆర్.కొంతలపాడు, ఎదురూరు, ఆర్కే దుద్యాల, తొలశాపురం, దేవమాడ, గొందిపర్ల, ఇ.తాండ్రపాడు, జి.సింగవరం, పూడూరు వంటి పలు గ్రామాలకు కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్ సూమారు 30 కి.మీ. దూరం ఉంటుంది. ఆయా గ్రామాల ప్రజలు ఏ అవసరానికైనా పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించాలంటే 2 బస్సులు మారాల్సి వస్తోంది. దీనికితోడు తెలంగాణ రాష్ట్ర సరిహద్దు, తుంగభద్ర నదీ తీర ప్రాంతాలు కావడంతో పెద్దఎత్తున అక్రమాలు జరుగుతుంటాయి. దీనిపై పోలీసులకు సమాచారం ఇచ్చినా వారు ఆయా ప్రాంతాలకు చేరుకోవాలంటే చాలా సమయం పడుతోంది. ఈ నేపథ్యంలో అక్రమార్కులు సునాయాసంగా తప్పించుకొంటున్నారు.

### గతంలో సౌకర్యవంతంగా..

గతంలో కర్నూలు నగరంలోని ఆర్డీవో కార్యాలయం సమీపంలో కర్నూలు తాలూకా పోలీసుస్టేషన్ ఉండేది. చాలా గ్రామాలకు సౌకర్యవంతంగా ఉండేది. ప్రస్తుతం నగరానికి దూరంగా. . మండల పరిధిలోని బి.తాండ్రపాడు సమీపంలో ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

## ఉల్లి క్వింటా గరిష్ఠ ధర రూ.3,951

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌కు శుక్రవారం 9,986 క్వింటాళ్ల ఉల్లి దిగుబడులు వచ్చాయి. క్వింటా కనిష్ఠ ధర రూ.500, గరిష్ఠ ధర రూ.3,951 పలికింది. 2,017 క్వింటాళ్ల వేరుశనకాయల దిగుబడులు రాగా క్వింటా కనిష్ఠ ధర రూ.2,222, గరిష్ఠ ధర రూ.7,269గా ఉంది.

## దేశ సేవలో ముందుంటాం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యకర్తలు క్రమశిక్షణతో దేశ సేవలో ముందుండి ఆదర్శంగా నిలవాలని ఏపీ ప్రచారక్ ఆదిత్య సూచించారు. కర్నూలు నగర శివారులోని క్రిడో ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రాథమిక శిక్షావర్గను శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. దేశ రక్షణకు ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందని స్పష్టం చేశారు.

## ఆత్మస్థైర్యం అవసరం

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: మహిళలకు ఆత్మస్థైర్యం అవసరమని డా.సావిత్రి పేర్కొన్నారు. దసరా నేపథ్యంలో సప్తగిరి నగర్‌లోని బృందావన్ ప్రైడ్ అపార్ట్‌మెంట్‌లో విశ్వహిందూ పరిషత్ మాతృశక్తి, దుర్గావాహిని మహిళా కార్యకర్తల సమావేశంలో ఆమె శుక్రవారం పాల్గొని మాట్లాడారు.

# ఖోఖో.. విజయాలు అందుకో

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే : పలువురు విద్యార్థినులు ఖోఖో పోటీల్లో రాణిస్తున్నారు. నిరంతరం సాధన చేస్తూ జట్టు విజయాలకు కృషి చేస్తున్నారు. తమ కళాశాలకు గుర్తింపు తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. త్వరలో జరిగే ఆర్‌యూ అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో ట్రోఫీ గెలుచుకోవడమే తమ లక్ష్యమని పేర్కొంటున్నారు. వారే సెయింట్ జోసఫ్ కళాశాల విద్యార్థినులు

### స్వర్ణ పతకం సాధించి..



పతకంతో నవిత

కర్నూలు నగర శివారు నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో నవిత ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు శిల్ప, తిక్కారెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. గతేడాది నగరంలోని సుంకేసుల రోడ్డు సెయింట్ జోసఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలలో ఖోఖో పోటీల్లో పాల్గొని మొదటి స్థానంలో నిలిచారు. 2018లో గుంటూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకంతో మెరిశారు. త్వరలో ఆర్‌యూలో జరిగే అనుబంధ కళాశాలల పోటీల్లో రాణించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నారు. ఆర్‌యూ జట్టుకు ప్రాతినిధ్యం వహించడమే లక్ష్యమని, ఇందుకోసం ప్రతి రోజు రెండు గంటల చొప్పున సాధన చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

### నిరంతరం శ్రమిస్తూ..

నందికొట్కూరు రోడ్డులోని సెయింట్ జోసఫ్ మహిళా కళాశాలలో మల్లేశ్వరి డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు లక్ష్మీదేవి, వెంకటరమణ. గతేడాది సుంకేసుల రోడ్డులోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల ఖోఖో పోటీల్లో పాల్గొని స్వర్ణ పతకం సాధించారు. 2022-23లో నగరంలోని సిల్వర్‌జూబ్లీ కళాశాల మైదానంలో జరిగిన ఆర్‌యూ అనుబంధ కళాశాలల పోటీల్లో ఖోఖో ఆడి కాంస్య పతకం అందుకున్నారు. త్వరలో జరిగే అంతర విశ్వవిద్యాలయాల పోటీల్లో రాణించడమే లక్ష్యంగా నిత్యం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు.



మల్లేశ్వరి

## 6 వరకు బస్సు కౌంటర్ల మూసివేత

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ప్రజా రవాణా సంస్థ పాత సాఫ్ట్‌వేర్‌ను కొత్త సాఫ్ట్‌వేర్‌లోకి మారుస్తుండటంతో శనివారం నుంచి 6వ తేదీ వరకు విద్యార్థులకు బస్సు పాసులు ఇవ్వరని కర్నూలు-2 డిపో మేనేజర్ సర్దార్ హుస్సేన్ శుక్రవారం తెలిపారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని సూచించారు.

## యాప్‌లో వివరాలు పొందుపరచాలి

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: జాతీయ కుష్ఠు, క్షయ ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత యాప్‌లు, పోర్టల్‌లో పొందుపరచాల్సిన అంశాలపై అవగాహన తప్పనిసరి అని జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్ తెలిపారు. కర్నూలు వైద్య కళాశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో జిల్లాలోని ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా.సత్యవతి, డీఐవో డా.నాగప్రసాద్, డా.మల్లికార్జునరెడ్డి, డా.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి డా.భాస్కర్, పక్కన డా.మల్లికార్జునరెడ్డి

## కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ సబ్ స్టేషన్‌లో విద్యుత్తు శాఖ ఈఈ శేషాద్రి ఆధ్వర్యంలో కెపాసిటర్ బ్యాంకును శుక్రవారం ఏర్పాటు చేసినట్లు ఏఈ సునీల్‌బాబు తెలిపారు. సమీప గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉండటంతో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచనమేరకు సబ్ స్టేషన్‌లో రూ.15 లక్షలతో కెపాసిటర్ బ్యాంకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్ సుబ్బన్న, ప్రొటెక్షన్ ఏఈ శారద, సిబ్బంది పాల్గొన్నారు.

## సేవా దృక్పథం అవసరం

కర్నూలు బిక్యాంపు, న్యూస్‌టుడే: విద్యార్థులు సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవాలని డీఎస్పీ మహబూబ్‌బాషా సూచించారు. నగరంలోని ఎస్టీబీసీ కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్ఎస్) ఆధ్వర్యంలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ ప్రశాంతి శ్యామ్ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛతాహి సేవ ముగింపు కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడారు. వైఎస్సార్ జిల్లా విశ్రాంత ఆర్‌జేడీ రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదువుకోవడం ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో శోభమౌనిక, ధన్యవతి, సునీతాజాన్, విజయ్‌కుమారి, శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ మహబూబ్‌బాషా

## వీఆర్వోల సమస్యలు పరిష్కరించండి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో గ్రామ రెవెన్యూ అధికారుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర కోశాధికారి, ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎ.మౌలీబాషా విన్నవించారు. ఈ మేరకు శుక్రవారం డీఆర్వో చిరంజీవిని కలిసి వినతిపత్రం అందించారు. రెండేళ్లయినా వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించడం లేదని చెప్పారు. అనంతరం నూతనంగా బాధ్యతలు చేపట్టిన కలెక్టరేట్ ఏవో విజయశ్రీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోల సంఘం కార్యదర్శి కె.నాగమద్దయ్య, కోశాధికారి కె.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ప్రకాశ్‌నగర్‌లోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేయాలని సీపీఎం జిల్లా నాయకులు ఎండీ ఆనంద్ బాబు, షరీఫ్ ఒక ప్రకటనలో కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అనంతరం 11వ వార్డు నూతన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులును ఎన్నుకున్నట్లు తెలిపారు.

కర్నూలు బి.క్యాంపు, న్యూస్‌టుడే: ఉచిత ఇసుక విధానాన్ని పక్కాగా అమలు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇసుక సమస్యపై ప్రభుత్వం దృష్టి సారించడం లేదని చెప్పారు.

ఓర్వకల్లు న్యూస్‌టుడే: ఓర్వకల్లు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాసులును పలువురు శుక్రవారం కలిసి సన్మానించారు. ఆర్‌యూపీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రుడు, మండల విద్యాధికారి ఓంకార్‌యాదవ్, కార్యాలయ సిబ్బంది ఎంపీడీవోకు శుభాకాంక్షలు తెలిపారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కల్లూరు ఎంపీడీవోగా నాగశేషాచలరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారిగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కిడారి సందీప్ కుమార్‌ను ఏపీఆర్ఎస్ఏ కర్నూలు డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయులు, కార్యదర్శి వేణుగోపాల్‌రావు, నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కోశాధికారిణి సహేరాబాను, సహాయ కార్యదర్శి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తెదేపా రాష్ట్ర కార్యదర్శి నంద్యాల నాగేంద్ర శుక్రవారం మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై మాట్లాడారు.

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అత్యంత వెనుకబడిన రజకులకు తెదేపా న్యాయం చేయాలని, నామినేటెడ్ పదవులు జనాభా నిష్పత్తి ప్రకారం కేటాయించాలని రాష్ట్ర రజక ఐక్య వేదిక సేవా సమితి అధ్యక్షుడు రాంబాబు కోరారు. మంగళగిరిలోని తెదేపా కార్యాలయంలో తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి విన్నవించారు.

## అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

క్రైం కార్నర్

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు శివారులోని పెద్దపాడు రాజీవ్‌గృహకల్ప కాలనీకి చెందిన సురేష్ (28) అనుమానాస్పదస్థితిలో మృతి చెందారు. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నెకు చెందిన శేషన్న, రంగమ్మ దంపతుల కుమారుడు సురేష్‌కు కోడుమూరు మండలం పులకుర్తికి చెందిన హైమావతి అలియాస్ సుజాతతో తొమ్మిదేళ్ల కిందట వివాహం జరిగింది. వీరు రెండేళ్ల కిందట కర్నూలుకు మకాం మార్చి రాజీవ్‌గృహకల్పలో ఉంటున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యాభర్తలు తరచూ గొడవపడేవారు. ఈనెల 2న సురేష్ తన తల్లిదండ్రులకు ఫోన్ చేసి తన ఇంటి వద్ద ఉండే బాబుగాడు, అతని కొడుకు బన్నిగాడు కొట్టినట్లు చెప్పారు. తర్వాత కొద్దిసేపటికి అతని ఫోన్ స్విచాఫ్ వచ్చింది. 3వ తేదీ రాత్రి సురేష్ ఇంట్లో ఉరేసుకున్నట్లు తెలియగా అతని తల్లిదండ్రులు హుటాహుటిన కర్నూలు చేరుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడి మృతికి కోడలు, ఆమె కుటుంబసభ్యులే కారణమంటూ అతని తల్లి రంగమ్మ ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు.



సురేష్ (పాత చిత్రం)

### పాతబస్తీ ప్రాంతంలో..

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: కొత్తపేటకు చెందిన రాజు (50) మృతిపై కర్నూలు ఒకటో పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. అతను డ్రైవర్‌గా పనిచేస్తుండేవారు. ఇతనికి కుమారుడు, కుమార్తె సంతానం. గురువారం రాత్రి పాతబస్తీ విక్టరీ థియేటర్ వద్దకు వచ్చి అక్కడే పడుకున్నారు. శుక్రవారం ఉదయం అకస్మాత్తుగా ప్రాణాలు వదిలారు. అతని తల్లి రూత్ ఫిర్యాదుమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


## రహదారి ప్రమాదంలో యువకుడి దుర్మరణం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు శివారులోని గుత్తి పెట్రోలు బంకు వద్ద సర్వీసు రోడ్డులో జరిగిన రహదారి ప్రమాదంలో బైరపోగు లోకేష్ (20) మృతి చెందారు. స్థానిక శరీన్‌నగర్‌కు చెందిన బైరపోగు మద్దిలేటి కుమారుడు లోకేష్ బేల్దారు పనిచేసేవారు. ఈనెల 2న ఇతని స్నేహితులు హైవేలో హోటల్ వద్ద ఉండి టీ తాగేందుకు అతడిని రమ్మని ఫోన్ చేశారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఐచర్ వాహనం ఢీకొట్టడంతో గాయపడ్డారు. మొదట కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించిన అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో లోకేష్ మృతదేహాన్ని తిరిగి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మట్కా బీటరుపై కేసు నమోదు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు ముజఫర్‌నగర్‌కు చెందిన లక్కిరెడ్డి బాలవెంకటరమణారెడ్డిని కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. అందిన సమాచారం మేరకు నిఘా ఉంచిన పోలీసులు అతనిపై దాడి చేసి మట్కా చీటీలతోపాటు ఐదు లీటర్ల నాటు సారా, రూ.41,770 స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నిరాశతో వెనుదిరిగారు



కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయం వద్దనున్న డిప్యూటీ డీఈవో కార్యాలయం శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలైనా తెరుచుకోలేదు. డిప్యూటీ డీఈవోను కలిసేందుకు వచ్చిన ఉపాధ్యాయులు వెనుతిరిగి వెళ్లాల్సి వచ్చింది. కర్నూలు మండల ఎంఈవో-1గా ఉన్న హనుమంతరావుకు ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఈవో బాధ్యతలు అప్పగించారు. కార్యాలయంలో ఉన్న ఒకే ఒక్క సిబ్బంది సెలవుపై వెళ్లడంతో ఈ పరిస్థితి నెలకొంది. హనుమంతరావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఎంఈవో-1 రెగ్యులర్ పోస్టు కావడంతో మండల కేంద్రంలో ఉంటానని, సీసీ సెలవుల్లో ఉండటంతో కార్యాలయానికి తాళం వేయాల్సి వచ్చిందని చెప్పారు. – న్యూస్‌టుడే, కర్నూలు విద్య